


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 25-03-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 170 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఉగాది శుభాకాంక్షలు



పాఠకులకు,
ప్రకటనకర్తలకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు ఇవియే
మా హృదయపూర్వక
శార్వరి నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు.
ఉగాది పర్వదినం సందర్భంగా
ఈ రోజు కార్యాలయానికి
శెలవు.

స్వీయనియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రత,
సామాజిక దూరం పాటించండి - కరోనాను నియంత్రించండి

- ఎడిటర్

## కరోనా కట్టడికి
# తప్పని లాక్‌డౌన్

- కాలపరిమితి మూడు వారాలు
- దేశానికి ఇది పరీక్షా సమయం
- నిర్లక్ష్యంగా ఉంటే భారీ మూల్యం తప్పదు
- ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ : బుధవారం రాత్రి 12 గంటల నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలు చేయడం జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసి ప్రజల ప్రాణాలు

తరువాయి 2లో..

# 'విశాఖలో మూడు కరోనా పాజిటివ్ కేసులు'

- కరోనా నియంత్రణకు అధికారుల కృషి అభినందనీయం
- ప్రజల భాగస్వామ్యం ఇంకా కావాలి .. సామాజిక దూరం పాటించాల్సిందే
- జిల్లాలో కరోనా టెస్ట్ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు
- రైతు బజార్లను మైదానాలలో ఏర్పాటు
- ప్రజలందరూ లాక్‌డౌన్‌కు సహకరించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని




విశాఖ సిటీః కరోనా మహమ్మారిని తరిమికొట్టడానికి జిల్లా యంత్రాంగం అహర్నిశలు చేస్తున్న కృషికి తీసుకుంటున్న చర్యలకు తన ప్రత్యేక అభినందనలు, ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా అని రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) తెలిపారు. స్థానిక వుడా చిల్డ్రన్ ఎరీనా లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి కే.కన్నబాబు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు లతో కలసి జిల్లాలో కరోనా వైరస్ నియంత్రణకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న అంశాలపై జిల్లా స్థాయి సమావేశాన్ని మంత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గడగడ లాడిస్తున్న కరోనా వైరస్ మహమ్మారిని తరిమి కొట్టడానికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మరియు సూచనల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు ప్రణాళికాబద్ధంగా వారికి అప్పగించిన బాధ్య తలను, చిత్తశుద్ధితో, దృఢనిశ్చయంతో ప్రజలకు అండగా మేమున్నాము వారిని రక్షించుకోవాలి అన్న ఆలోచనతో విధులను నిర్వర్తిస్తున్నందుకు తన ప్రత్యేక అభినందనలను, కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు. కరోనా వైరస్ ను అరికట్టడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో

తరువాయి 2లో..



# క్యాష్ విత్‌డ్రాపై ఆంక్షల సడలింపు

**కనీస నగదు నిల్వ పరిమితి ఎత్తివేత .. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ: కరోనా వైరస్ కట్టడికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పాటించాలని ఆదేశించిన కేంద్రం క్యాష్ విత్‌డ్రాలపై ఆంక్షలను సడలించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.

ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి నగదును విత్‌డ్రా చేసినా ఎటువంటి చార్జీలు ఉండబోవని స్పష్టం చేశారు.

మూడు నెలల వరకూ ఏ బ్యాంకు ఏటీఎంలోనైనా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

బ్యాంకు ఖాతాల్లో కనీస నగదు నిల్వ పరిమితిని కూడా ఎత్తేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ నిర్ణయంతో లాక్‌డౌన్‌ను పాటించే ప్రజలకు కొంత ఊరటనిచ్చినట్టయింది.

ఈ సడలింపుతో కనీస నగదు నిల్వను కూడా దైనందిన ఖర్చులకు వినియోగించుకునే అవకాశం ప్రజలకు లభించినట్టయింది.

# ఇంటివద్దకే 'జగనన్న గోరుముద్ద'



అనంతపురం విద్య: కోవిడ్-19 కలకలంతో మార్చి నెలాఖరు వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నేరుగా ఇళ్లవద్దకే 'జగనన్న గోరుముద్ద' కింద మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. బియ్యం, చిక్కీ, కోడిగుడ్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వలంటీర్ల ద్వారా 31వ తేదీ వరకూ విద్యార్థులకు ఇళ్ల వద్దకే పంపిణీ చేయనున్నారు.

# వేగంగా విస్తరిస్తున్న కరోనా మహమ్మారి...

- 67 రోజుల్లో లక్షమందికి కరోనా...
- ఆపై 15 రోజుల్లో 2 లక్షల మందికిపైగా వ్యాపించింది
- డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ మహమ్మారి అత్యంత వేగంగా విస్తరిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వెల్లడించింది. మొదట కరోనా వైరస్ 67 రోజుల్లో లక్షమందికి సోకింది. అదికూడా ఎక్కువగా ఈ వైరస్ ఉద్భవించిన చైనా దేశానికే పరిమితమైంది. కానీ ఆ తర్వాత 11 రోజుల్లోనే అనూహ్యంగా పలు దేశాల్లో 2 లక్షల మంది రోగులకు కరోనా సోకింది. అనంతరం గడచిన 4 రోజుల్లో కొవిడ్-19 రోగుల సంఖ్య లక్ష మందికి పైగా వచ్చింది. అంటే ఈ వైరస్ ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ సోకిన రోగుల సంఖ్య 3,80,000 మందికి చేరుకోగా మృతుల సంఖ్య 16 వేలకు దాటింది.

**ఇటలీలో అత్యధికం...**

ఇటలీ దేశంలో ఫిబ్రవరి నెలలో 3 కేసులతో ప్రారంభమై 60వేలకు చేరింది. యూరప్ దేశాల్లోనే ఇటలీలో అత్యధికంగా 6వేలకు పైగా ప్రజలు కరోనా కాటుకు మరణించారు. ఇంకా చాలా

తరువాయి 2లో..

## రాజ్యసభ ఎన్నికలు వాయిదా

**ఏపీలో నాలుగు స్థానాలకు నిలిచిన పోలింగ్**



అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా కల్లోలం దేశ వ్యాప్తంగా కలకలం రేపుతున్న వేళ.. ఈ నెల 26న

తరువాయి 2లో..




# ఏపీలో పదో తరగతి పరీక్షలు వాయిదా..

**ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువు పెంపు**
**విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్**



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి 31 నుంచి జరగాల్సిన పదో తరగతి పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. రెండు వారాలపాటు పరీక్షలు వాయిదా వేయనున్నట్టు ఆయన తెలిపారు. మార్చి 31 తర్వాత పరిస్థితులను సమీక్షించి కొత్త తేదీలు ప్రకటిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం కరోనా కట్టడిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కరోనా వ్యాపి నిరోధక చర్యల్లో భాగంగా ప్రస్తుతం రాష్ట్రంలో లాక్‌డౌన్ కొనసాగుతున్న

తరువాయి 2లో..

# ప్రజల కోసమే పోలీస్ ఆంక్షలు

- ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు
- జల్లెడ పడుతున్న ప్రత్యేక బృందాలు
- లాక్‌డౌన్ కఠినంగా అమలు
- అంటు వ్యాధుల నిరోధక చట్టం-1897 కఠినంగా అమలు
- తాజా పరిస్థితిపై జిల్లా ఎస్పీలతో డీజీపీ సవాంగ్ టెలీ కాన్ఫరెన్స్



అమరావతి: కరోనా మహమ్మారి నుంచి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కఠినమైన ఆంక్షలు అమలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతోందని డీజీపీ డి.గౌతమ్ సవాంగ్ పేర్కొన్నారు. జనతా కర్ఫ్యూను స్వచ్ఛందంగా విజయవంతం చేసిన ప్రజలు ఈ నెల 31 వరకు ప్రకటించిన లాక్‌డౌన్‌ను ఉల్లంఘించి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో కఠినమైన ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. లాక్‌డౌన్ అమలుకు స్వచ్ఛందంగా ప్రజలు సహకరించే పరిస్థితి లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు రోడ్లపైకి వచ్చి తగు చర్యలు చేపట్టారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రధాన నగరాలతోపాటు అనేక పట్టణాలు, జిల్లా కేంద్రాలు, గ్రామాల్లోనూ పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేసి, ప్రధాన రహదారులను మూసివేశారు. ఆటోలు, ప్రైవేటు వాహనాలు బయటకు రాకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. అత్యవసర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు.

**జల్లెడ పడుతున్న ప్రత్యేక బృందాలు**

కరోనా పాజిటివ్ కేసులు ఏమైనా ఉన్నాయా? అనే విషయమై రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక బృందాలు జల్లెడ పడుతున్నాయి. గ్రామ, వార్డు వలంటీర్ల సాయంతో ఆయా ప్రాంతాల్లో వైద్య, రెవెన్యూ సిబ్బంది,

తరువాయి 2లో..

# ‘విశాఖలో మూడు కరోనా పాజిటివ్ కేసులు’

( మొదటి పేజీ తరువాయి )



కూడిన 20 రకాల కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల ద్వారా వారికి అప్పగించిన పనులను నిర్విఘ్నంగా కొనసాగే విధంగా చర్యలు తీసుకొనడం ద్వారా వ్యాధి ప్రబల కుండా కట్టడి చేయగలుగు తున్నారన్నారు. వైద్యానికి ఇంకా అవసరమైన మందులు మరియు ఎక్విప్మెంట్ కొరకు గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుని వెళ్లి తగుచర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కరోనా పాజిటివ్ కేసులు విదేశాల నుండి వచ్చిన వారి ద్వారా నమోదయ్యాయని, కాబట్టి విదేశాల నుండి వచ్చిన వారు స్వచ్ఛందంగా రిపోర్టు చేసిన పక్షంలో వారికి వైద్య సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా అరి కట్టవచ్చునన్నారు. జిల్లాలో కరోనా టెస్ట్ ల్యాబ్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి , వారి ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని రకాలుగా అనుకూలతలు కల విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేపట్టనున్నామని అన్నారు. అదేవిధంగా విమ్స్ ఆస్పత్రిని కోవిడ్ -19 ఆసుపత్రిగా ప్రకటించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి వ్యాధిగ్రస్తులను ఉంచే విధంగా ముందు జాగ్రత్తగా ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్పత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా వార్డులలో వెంటిలేటర్ లను అందుబాటులో ఉంచాలన్నారు. కరోనా వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లాక్ డౌన్ కు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలన్నారు. తాత్కాలికంగా కొంత ఇబ్బంది పడినా , శాశ్వతంగా దీని బారి నుండి బయటపడిన తర్వాత రక్షణ పొందగలుగుతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజలు స్వీయ నిర్బంధం పాటిస్తూ ఎన్ని పనులు ఉన్నా ఇంట్లోనే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. లాక్ డౌన్ లో పాల్గొనటం ద్వారా మన కుటుంబానికి, రాష్ట్రానికి ,దేశానికి మేలు జరిగినట్లు అవుతుందన్నారు. అందరూ కలసికట్టుగా పని చేయడం ద్వారా భవిష్యత్తులో కరోనా వ్యాప్తి నిరోధానికి కృషి చేసినట్లు అవుతుందన్నారు. ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు కొనుక్కునే విధంగా రైతు బజార్ల ను దగ్గరలో గల మైదాన ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. జఁతీఁశీఁఖు నియంత్రణకు సామాజిక దూరం పాటించడం ద్వారా గుంపులుగా లేకుండా కొంత వరకు నియంత్రించవచ్చు అన్నారు.. అన్ని రంగాలలోనూ వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ జిల్లా భవిష్యత్తులో కరోనా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ కరోనా వైరస్ నివారణకు జిల్లా వ్యాప్తంగా 20 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వారందరూ అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో త్రిసభ్య కమిటీ , గ్రామ మరియు వార్డు స్థాయిలో ఐదుగురితో కూడిన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని వీరందరూ ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అత్యవసరమైన ఫార్మా కంపెనీలు ,స్టీల్ ప్లాంటు , విశాఖ పోర్టు ట్రస్టు , గంగవరం పోర్టు, ఆయిల్ కంపెనీలకు తక్కువ సంఖ్యలో షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు . మిగిలిన అన్ని కంపెనీల లను లాక్ డౌన్ కు ఆదేశించడం జరిగిందన్నారు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాత్రి 8 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మెడికల్ షాప్ లను మాత్రమే తెరిచే అనుమతి ఉన్నదని, మిగిలిన ఎటువంటి షాపులు తెరవకూడదని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విదేశాల నుండి వచ్చే వారి వివరాలను గుర్తించి హోమ్ క్వారంటైన్ లో ఉండే విధంగానూ జలుబు , దగ్గు లక్షణాలు కనిపిస్తే వారిని ఐసోలేషన్ వార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని మంత్రికి వివరించారు.



ఈ సమావేశంలో వీ.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ , పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు , శాసనసభ్యులు, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# బ్యాంకులు సిబ్బందిని తగ్గించాలి

శ్రీకాకుళం: బ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ మంగళ వారం బ్యాంకు అధికారులను ఆదేశించారు. కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరి మధ్య సామాజిక దూరం పాటించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసారు. ఇందులో భాగంగా బ్యాంకులు సిబ్బందిని షిప్టులుగా మార్చాలని, ఎక్కువ మంది సిబ్బంది ఉండరాదని ఆదేశించారు. నగదు డిపాజిట్లు, నగదు విత్ డ్రావల్స్ మాత్రమే ఉండాలని, ఇతర విభాగాలు మూసి వేయాలని ఆయన స్పష్టం చేసారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జివిబిడి హరి ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు శాఖలు సిబ్బందిని తగ్గించారని వివరించారు. బ్యాంకులు మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయని చెప్పారు. విధులకు వెళ్ళుటకు ఆటంకం లేకుండా గుర్తింపు కార్డుపై పోలీసులు అనుమతించే విధంగా సూచనలు జారీ చేయాలని కోరారు.

రవాణా లేనందున సొంత వాహనాలపై వెళుతున్నారని పేర్కొన్నారు. నగదు రవాణాలో ఆటంకం కలుగకుండా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా బ్యాంకు జోనల్ మేనేజర్ జి.కృష్ణయ్య, ఎస్.బి.ఐ రీజనల్ మేనేజర్ కె.తేజోమయి అరవింద్, ఏపిజివిబి రీజనల్ మేనేజర్ గురునాథ రావు పాల్గొన్నారు.

## వర్తకులు, వ్యాపారులు సామాజిక బాధ్యతతో కరోనా వ్యాధి ప్రబలకుండా సహకరించాలి : కలెక్టర్ మురళీధర్‌రెడ్డి

కాకినాడ : వర్తకులు, వ్యాపారులు సామాజిక బాధ్యతతో తమ వంతు కర్తవ్యంగా కరోన వ్యాధి ప్రబలకుండా సహకరించాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఛాంబర్ ఆఫ్ కామర్స్, వర్తకులతో కలక్టర్ కార్యాలయంలో కరోన నియంత్రణ గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ సడలించిన సమయాలలో ఎక్కువ మంది ప్రజలు గుమ్మిగూడితే చాలా ప్రమాదమని సామాజిగ దూరం పాటించేలా వర్తకులు, అధికారులు చూడాలన్నారు. ఉదయం 9.30 గంటల కల్లా వ్యాపార సంస్థలు మూసివేస్తే బాగుంటుందని, దాని వలన అవసరమైన వారు వచ్చి వస్తువులను కొనుగోలు చేయ డానికి అవకాశం ఉంటుందన్నారు. మందులు షాపులు, కూర గాయలు వంటి నిత్యావసర వస్తువుల వద్ద ఎక్కువ మంది గుమ్మి గూడకుండా చూడాలన్నారు.తరువాత ఎట్టి పరిస్థితుల్లోను ఏ వస్తువైనా యం.ఆర్.పి. కంటే ఎక్కువ అమ్మితే చర్యలు తీసుకోవడ జరుగుతుందన్నారు చేయాలన్నారు. ఈ విషయం పై వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# సామాజిక బాధ్యతతో విరాళాలు అందించాలి



శ్రీకాకుళం: కరోనా వ్యాప్తి నివారణకు సామాజిక బాధ్యతతో దాతలు విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ పిలుపునిచ్చారు. ఆర్ష స్వచ్ఛంధ సంస్థ, పి.వి.రామ్మోహన్ ఫౌండేషన్, డా.దానేటి శ్రీధర్, లయన్స్ శ్రీకాకుళం సెంట్రల్ శాఖ మంగళ వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సామాజిక బాధ్యత క్రింద విరాళాలు అందజేసారు. జిల్లాలో స్వీయ గృహనిర్భందంలో ఉన్నవారికి 14 రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేయుటకు, కరోనా బాధితులకు ఇతర సహాయ చర్యలు చేపట్టుటకు ఈ నిధులను ఉపయోగించుట జరుగుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్పందన కేబుల్ విజన్, శివాని, వెంకటేశ్వర ఇంజనీరింగు కళాశాలలు చెక్కులను అందజేయగా., మంగళ వారం డా.దానేటి శ్రీధర్ లక్ష రూపాయల నగదును, ఆర్ష స్వచ్ఛంధ సంస్థ తరపున ఎన్.సన్యాసి రావు రూ.20 వేలకు, పి.వి.రామ్మోహన్ ఫౌండేషన్ తరపున రామ్మోన రావు లక్ష రూపాయలకు, లయన్స్ శ్రీకాకుళం సెంట్రల్ శాఖ అధ్యక్షులు నటుకుల మోహన్ రూ.20 వేలకు చెక్కులను జిల్లా కలెక్టర్ కు అందజేసారు అందజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. కరోనా జిల్లాకు చేరకుండా మట్టుబెట్టాలన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సామాజిక బాధ్యతతో విరాళాలు అందించే వారు సి.ఎస్.ఆర్ ఏక్టివిటీస్, శ్రీకాకుళం పేరున శ్రీకాకుళం కలెక్టరేట్ ఆంధ్రా బ్యాంకు శాఖలో గల బ్యాంకు ఖాతా నంబరు 142710100068597, ఐఎఫ్ఎస్ సి కోడ్ ఎ.ఎన్.డి.బి (సూచీగాది) 0001427 లో జమ చేయవచ్చని లేదా చెక్కులను అందజేయవచ్చని ఆయన తెలిపారు.

### క్వారంటైన్ గదులు సిద్ధం

కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా స్వీయ నిర్భంద గదులు (క్వారంటైన్) సిద్ధం చేసామని జిల్లా కలెక్టర్ జె నివాస్ చెప్పారు. విదేశాల నుండి 13 మంది సోమ వారం జిల్లాకు విచ్చేసారని, వారందరిని నిర్భంద గదులలో పెట్టామని తెలిపారు. వారితోపాటు ఈ నెల 21 తరువాత విచ్చేసిన మరో ఐదుగురిని వెరశి 18 మందిని నిర్భంద గదుల్లో పెట్టామని పేర్కొన్నారు. క్వారంటైన్ గదుల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటుచేసి కదలికలను గమనిస్తున్నామని ఆయన చెప్పారు.

### విశాఖలో బృందం

జిల్లాకు విదేశాల నుండి విచ్చేసేవారిని విశాఖపట్నంలోనే గుర్తించి నిర్భంద గదుల్లోకి తీసుకువచ్చుటకు విశాఖపట్నంలో 12 మందితో కూడిన ఒక రెవిన్యూ బృందం, మరో 12 మందితో కూడిన ఒక పోలీసు బృందంను ఏర్పాటు చేసామని వివరించారు. జిల్లాకు 859 మంది విదేశాల నుండి విచ్చేయగా వారిలో ఇంకా 14 రోజుల గడువు పూర్తి కాని వారు 259 మంది వరకు మాత్రమే ఉన్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రాకపోకలు నిషేధించామని, 144వ సెక్షన్ అమలులో ఉందని, జిల్లా యంత్రాంగం, పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలను కోరారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన 52 మందిపై సోమ వారం కేసులు నమోదు చేసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన కేబుల్ ఎం.డి దుప్పల వెంకట రావు, లయన్స్ క్లబ్ సభ్యులు డా.కృష్ణ మోహన్, దేవభూషణ రావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కట్టడికి
# తప్పని లాక్‌డౌన్

కాపాడేందుకు లాక్‌డౌన్ తప్పదని ఆయన స్పష్టం చేశారు. లాక్‌డౌన్ మూడు వారాలు ఉంటుందని చెప్పారు. ఇది ఒకరకంగా కర్ఫ్యూ వంటిదేనని అన్నారు.

రాబోయే 21 రోజులు ప్రతి ఒక్కరికీ కీలకమని వ్యాఖ్యానించారు. దేశానికి ఇది పరీక్షా సమయమని, నిర్లక్ష్యంగా ఉంటే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ సంక్లిష్ట సమయంలో అందరూ సహకరించాలని, సామాజిక దూరం పాటించడమే ఈ మహమ్మారిని నియంత్రించేందుకు పరిష్కారమని అన్నారు.

స్వీయ నిర్బంధం తప్ప మరో మార్గం లేదన్నారు. సమిష్టిగా ఈ వైరస్‌పై పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఇళ్లలో ఉంటేనే కరోనా మహమ్మారి వైరస్ గొలుసును ఛేదించాలని అన్నారు. ప్రపంచ పరిణామాలను మనం పరిశీలిస్తున్నామని, అగ్రరాజ్యాలను సైతం ఈ మహమ్మారి అతలాకుతలం చేస్తోందని గుర్తుచేశారు. కరోనా సంక్రమించిందన్న విషయం ముందుగా ఎవరూ గుర్తించలేరన్నారు. వ్యాధి లక్షణాలున్న వారే కాకుండా అందరూ సామాజిక దూరం పాటించాలని అన్నారు. తాను ప్రధానిగా కాకుండా మీ కుటుంబ సభ్యుడిలా చెబుతున్నానని, ఈ మూడు వారాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒక వ్యక్తి నుంచి వేల మందికి వైరస్ వ్యాపించవచ్చని అన్నారు. 11 రోజుల్లోనే లక్ష నుంచి రెండు లక్షల మందికి సోకిందని డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాలు వెల్లడించాయని చెప్పారు.

## ఏపీలో పదో తరగతి పరీక్షలు వాయిదా..

నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది.

*ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువు పెంపు..*

రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో ఎంసెట్, ఈసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడవును పొడిగిస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మార్చి 29 వరకు ఉన్న ఎంసెట్ దరఖాస్తు గడువును ఏప్రిల్ 5కు పొడిగించారు. అలాగే ఏప్రిల్ 2వరకు ఉన్న ఈసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షల గడువును ఏప్రిల్ 9వరకు పొడిగించారు.

## వేగంగా విస్తరిస్తున్న కరోనా మహమ్మారి...

దేశాల్లో కరోనా వైరస్ పరీక్షలు పెద్ద సంఖ్యలో చేయడం లేదని, వనరులు లేక పోవడం, కరోనా కిట్ల కొరతతో పలు దేశాలు అవస్థలు పడుతున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అథనామ్ అంగీకరించారు.

భారతదేశంలో కరోనా కట్టడికి లాక్‌డౌన్

భారతదేశంలో కరోనా వైరస్ పరీక్షలు చేయడానికి ఎట్టకేలకు 12 ప్రైవేటు ప్రయోగశాలలను ప్రభుత్వం అంగీకరించింది. భారతదేశంలో 400 కు పైగా కరోనా వైరస్ పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్య పదికి చేరడంతో మేల్కొన్న సర్కారు లాక్‌డౌన్ చేపట్టింది. భారతదేశం విదేశాల నుంచి వచ్చే అన్ని విమాన సర్వీసులను నిషేధించింది. అనంతరం దేశీయ ప్రయాణాలను కూడా నిలిపివేసింది.

## ప్రజల కోసమే పోలీస్ ఆంక్షలు

తదితరులతో కూడిన టీమ్‌కు పోలీసులు ప్రత్యేక బందోబస్తు కల్పించారు. విదేశాల నుంచి ఇటీవల ఎవరైనా వచ్చారా? అనే విషయాన్ని ఆరా తీసేందుకు పోలీసులు ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ కాలంనాటి 1897 చట్టాన్ని ‘ఆంధ్రప్రదేశ్ అంటు వ్యాధి కొవిడ్-19 రెగ్యులేషన్ 2020’గా రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అంటు వ్యాధుల చట్టం-1897లోని సెక్షన్ 2, 3, 4 ప్రకారం కఠినమైన నిబంధనలు అమలు చేస్తారు. తద్వారా గాలి, మనిషి నుంచి మనిషికి వ్యాధి సోకకుండా నియంత్రించేందుకు అత్యవసరం మినహా సకల వ్యవస్థలను దిగ్బంధించే ప్రయత్నం చేస్తారు. దీన్నే లాక్‌డౌన్‌గా వ్యవహరిస్తున్నారు. లాక్‌డౌన్ కఠినంగా అమలు

కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు డీజీపీ డి.గౌతమ్ సవాంగ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల్లో తాజా పరిస్థితి, పోలీసులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైరస్ తీవ్రత ప్రజలకు అర్థమయ్యేలా తొలుత సహనంతోనే సమాధానం చెప్పాలని, స్వచ్ఛంద లాక్‌డౌన్‌కు సహకరించకపోతే కఠినంగానే వ్యవహరించాలన్నారు. దుకాణదారులు, వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు.

## రాజ్యసభ ఎన్నికలు వాయిదా

జరగాల్సిన రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా 55 రాజ్యసభ సీట్ల కోసం ఫిబ్రవరి 25న ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అందులో ఇప్పటికే 37 సీట్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే, రాజ్యసభ లో సంఖ్య పరంగా సభా నిర్వహణ కు ఇబ్బంది లేకపోవటంతో..కరోనా ఎఫెక్ట్‌తో ఈ ఎన్నికలను వాయిదా వేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఏపీలో నాలుగు సీట్లకు ఎన్నికలు వాయిదా.. ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవ్వటంతో వాటి భర్తీ కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ నుండి రాజ్యసభ సభ్యులుగా ఉన్న కే కేశవరావు, ఏకే ఖాన్, టి సుబ్బిరామిరెడ్డి, సీతారామ లక్ష్మి కాల పరమితి ముగిసింది. దీంతో..వారి స్థానంలో ప్రస్తుతం ఏపీ శాసనసభలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగా నాలుగు స్థానాలు వైసీపీకి దక్కనున్నాయి. అయితే, ఏపీలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో టీడీపీ సైతం అనూహ్యంగా తమ అభ్యర్థిని బరిలోకి దింపింది. వర్ల రామయ్య టీడీపీ నుండి నామినేషన్ దాఖలు చేసారు. ఇక, వైసీపీ నుండి అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్ర బోస్, పారిశ్రామిక వేత్త పరిమల్ నత్వానీ నామినేషన్లు వేసారు. నాలుగు స్థానాలకు ఈ నెల 26న పోలింగ్ జరగాల్సి ఉంది. ఇందు కోసం ఏపీ శాసనసభా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. అయితే, దేశ వ్యాప్తంగా కరోనా కల్లోలంతో ఎన్నికల సంఘం రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించింది. త్వరలోనే ఎన్నికల నిర్వహణ పైన ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

**ఏపీలో నాలుగు సీట్లకు ఎన్నికలు వాయిదా..**

ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవ్వటంతో వాటి భర్తీ కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ నుండి రాజ్యసభ సభ్యులుగా ఉన్న కే కేశవరావు, ఏకే ఖాన్, టి సుబ్బిరామిరెడ్డి, సీతారామ లక్ష్మి కాలపరమితి ముగిసింది. దీంతో..వారి స్థానంలో ప్రస్తుతం ఏపీ శాసనసభలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగా నాలుగు స్థానాలు వైసీపీకి దక్కనున్నాయి. అయితే, ఏపీలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో టీడీపీ సైతం అనూహ్యంగా తమ అభ్యర్థిని బరిలోకి దింపింది. వర్ల రామయ్య టీడీపీ నుండి నామినేషన్ దాఖలు చేసారు. ఇక, వైసీపీ నుండి అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్ర బోస్, పారిశ్రామిక వేత్త పరిమల్ నత్వానీ నామినేషన్లు వేసారు. నాలుగు స్థానాలకు ఈ నెల 26న పోలింగ్ జరగాల్సి ఉంది. ఇందు కోసం ఏపీ శాసనసభా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. అయితే, దేశ వ్యాప్తంగా కరోనా కల్లోలంతో ఎన్నికల సంఘం రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించింది. త్వరలోనే ఎన్నికల నిర్వహణ పైన ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

## ఓల్డేజ్ హోమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా
## మాస్కులు, సబ్బులు పంపిణీ : మంత్రి మల్లాడి

యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ఓల్డ్ ఏజ్ హోమ్ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ప్రతి ఇంటికి కుటుంబ సభ్యులు అందరికీ ఉచితంగా సబ్బులు ,మాస్క్ లు పంపిణీ చేయనున్నట్లు ఓల్డ్ ఎజ్ హోమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ప్రతి ఇంటికీ సభ్యులందరికీ ఒక్కరోజులో మాస్క్ లు సబ్బులు పంపిణీ చేసే విధంగా అన్ని చర్యలు చేపట్టామన్నారు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు తప్పకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించాలని చేతులు శుభ్రంగా కడుక్కోవాలని మాస్క్ లు ధరించాలి గుంపులుగా ప్రజలు ఉండవద్దని దూరప్రయాణాలు చేయవద్దని ఇంటికే పరిమితమైతే ప్రమాదం తీవ్రత తగ్గించు కునే వారు అవుతావని ప్రజలందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి అన్నారు నాలుగు రోజుల పాటు జనతా కర్ఫ్యూ నిర్వహించనున్నామని అన్నారు.

తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉల్లంఘింస్తే కఠిన చర్యలు తీసుకుంటారని ఆయన అన్నారు.

# ఏయూకు పాలక మండలి ఏర్పాటు

## ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రవిశ్వకళాపరిషత్ : ఆంధ్రవిశ్వవిద్యాలయానికి పాలక మండలి ఏర్పాటు అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసింది. గత పాలక మండలి పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో నూతన ప్రభుత్వం కొత్త పాలక మండలిని నియమించింది. దీనికి సంబందించిన ఉత్తర్వులు జిఓ ఆర్‌టి నెం 49ని విడుదల చేసింది.

నూతనంగా ఏర్పాటైన పాలక మండలి మూడు సంవత్సరాల పదవీ కాలంతో పనిచేస్తుంది. వర్సిటీకి విలువైన సూచనలు అందించడం, పరిపాలనా పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో పాలక మండలి దోహదకారిగా నిలుస్తుంది.

పాలక మండలి సభ్యులుగా ఏయూ సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు టి.శోభశ్రీ, ఐఏఎస్‌ఇ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.శివ ప్రసాద్, వర్సిటీ కళాశాలల నుంచి ఫ్యార్మశీ కళాశాల ఆచార్యురాలు డాక్టర్ ఏ.క్రిష్ణమంజరి పవార్, వర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి డాక్టర్ వి.ఎస్ క్రిష్ణకళాశాల అధ్యాపకులు డాక్టర్ సి.హెచ్.వి.ఎం.కె హరి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ విభాగంలో వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, పరిశ్రమలు, వాణిజ్యం, విద్య, న్యాయ, సామాజిక సేవా విభాగాల నుంచి కె.వి.ఎస్ ఆంజనేయ వర్మ, గిరిజ అగస్టీన్, వై.యేసుపాదం, డాక్టర్ ఎం.వి. సాయి దేవ మణిలు సభ్యులుగా నియమితులయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం పాలక మండలి సభ్యుల ఎంపికలో విభిన్న సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ, మహిళలకు పెద్దపీట వేసింది. తొమ్మిది మంది సభ్యుల్లో నలుగురు మహిళలను నియమించడం విశేషం.

మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ, సామాజిక వర్గాల వారీగా సమతూకం పాటిస్తూ నూతన పాలక మండలి ఏర్పాటు అయ్యింది.

# బిల్లుచెల్లింపులు లేక కుదేలైన నిర్మాణరంగం



విశాఖ సిటీః గత సంవత్సరన్నర కాలంగా ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీలలో పనిచేసే కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నారని పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ చెరువు రామ కోటయ్య తెలిపారు.

బ్యాంకులకు ఫైనాన్షియల్ ఇన్సిట్యూషన్స్‌లకు పెద్ద మొత్తంలో బకాయిలు పడ్డారని ముఖ్యమంత్రి కి తెలిపారు. లక్షలాది మంది కార్మికులు, వేల మంది ఉద్యోగులు ,వందల మంది నిపుణులు పనిచేస్తున్న నిర్మాణ రంగం కుదేలైంది. పై విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో అందరి అధికారులను దఫదఫాలుగా బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్టర్లు కలిసి సమస్యను వివరించడం జరిగిందన్నారు. ప్రతిసారీ అతి త్వరలో నిధులు విడుదల చేస్తామని చెప్పడం, రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులు, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు కూడా ఇవ్వకపోవడం వలన కాంట్రాక్టర్ల వ్యవస్థ అతలాకుతలమైందని పేర్కొన్నారు. కొంతమంది ఆత్మహత్యాయత్నం కూడా చేసుకున్నారు. ఈనెల 22వ తారీకు నాడు సిహెచ్.శరత్ బాబు అనే కాంట్రాక్టర్ తెలంగాణలో బిల్లులు రాని కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు. అదే స్థితిలో ఆంధ్రప్రదేశ్ లోని కాంట్రాక్టర్లు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుత పరిస్థితిలో కోవిడ్ -19 ప్రభావం వలన కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలని తమ ప్రభుత్వం ఆజ్ఞ ఇచ్చిన సందర్భంలో మాకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయవలసిందిగా కోరుతున్నాము. దీనివలన లక్షలాదిగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించడం తో పాటు కోవిడ్-19 పై మీరు చేస్తున్న యుద్ధంలో మేము కూడా భాగస్వామిగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్ల తరపున హామీ ఇస్తున్నాను.

### ప్రభుత్వ ఆదేశాలను

# పట్టించుకోకుండా బయటకొచ్చారో ...

## ఆర్డీవో జె.సీతారామారావు



అనకాపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న లాక్‌డౌన్ కారణంగా ఐదుగురు మించి రోడ్లపై ఎవరూ రావడానికి వీల్లేదని ఆర్డీవో జె.సీతారామారావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రోడ్డు మీదకు ఏ ఒక్క వాహనం వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ నెల 31 వరకు ఇళ్లకు పరిమితం కావాలని సాయంత్రం 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎవరూ బయటకు రావడానికి వీల్లేదని ఆయన తేల్చి చెప్పారు. అనకాపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో కరోనా ప్రభావమేమీ లేదని ధ్రువీకరించారు. అయినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. లాక్‌డౌన్ ఆదేశాలు ఉల్లంఘించిన వర్గాలపై ఐపీసీ 188 ప్రకారం ప్రభుత్వాదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సీతారామారావు ఆ ప్రకటనలో హెచ్చరించారు.

### అందుబాటులో ఉండనున్న సేవలు ...

- ఆహారం, సరుకులు, పాలు, పండ్లు, కూరగాయలు, చేపల రవాణా
- గిడ్డంగులు, ఆస్పత్రులు, మెడికల్ షాపులు, కళ్లజోళ్ల దుకాణాలు
- ఔషధ తయారీ వాటి రవాణా కార్యాలయాలు
- నిత్యావసర తయారీ యూనిట్లు, వాటి సరఫరా
- కరోనా నియంత్రణ కార్యాకలాపాల్లో పాల్గొనే ప్రైవేట్ సంస్థలు
- పెట్రోల్ పంపులు, ఎల్పీజీ గ్యాస్, ఆయిల్ ఏజెన్సీలు, వాటి రవాణా
- టెలికం, ఇంటర్నెట్ సేవలు
- పోలీసు, వైద్య, ఆరోగ్యం, పట్టణ, స్థానిక సంస్థలు..
- అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్, తాగునీరు, పురపాలక సేవలు..
- బ్యాంకులు, ఏటీఎంలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా
- ఆహారం, ఔషధాలు, వైద్య పరికరాలను ఈ కామర్స్ సైట్ ద్వారా పొందే అవకాశం

తప్పనిసరిగా ఉత్పత్తి , తయారు చేయాల్సిన సంస్థలు ఏమైనా ఉంటే వాటి మినహాయింపు కోసం కలెక్టర్ అనుమతి తీసుకోవాలి.

# కరోన నియంత్రణ కోసం సహకరించండి

## వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు



విశాఖ సిటీ : కరోన నివారణ చర్యలలో భాగంగా ప్రభుత్వం లాకడౌన్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ఇంటినుండి బయటకు రాకుండా ఇంటిలోని ఉండాలని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు కోరారు. మంగళవారం ఉదయం సీతమ్మధార రైతు బజార్ ను సందర్శించిన ఆయన అక్కడ కు వచ్చిన ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయట రావద్దని, ఒకవేళ రావాలిసి వస్తే అందరూ ఒకే చోట ఉండకుండా సామాజిక దూరం పాటించాలని విధిగా మాస్కులు ధరించాలని, అలాగే అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షస్తూ జన సమూహం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై కా పా నాయకులు కిరణ్ రాజు, ఆళ్ళ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాబర్ట్ కోచ్‌కు ఘన నివాళి

## ప్రపంచ క్షయ దినోత్సవం

విశాఖ సిటీ : మార్చి 24 వతేదీ 2020న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు మరియు వుడా చిల్డ్రన్ థియేటర్ నందు రాబర్ట్ కోచ్ (క్షయ క్రిమిని కనుకొన్న శాస్త్రవేత్త) యొక్క చిత్రపటనానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణ అధికారి డా. ఎన్. వసుంధర ప్రసంగిస్తూ ఈ సంవత్సరం ప్రపంచం మొత్తం కరోనా ప్రబలుతుండడం వలన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవానికి ఎటువంటి అవగాహనా సదస్సులు గాని, ర్యాలీలు గాని, మీటింగ్‌లు కానీ జరపలేక పోయామని కానీ, ప్రజలందరూ క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించంచుట కొరకు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం జరిగిందని జిల్లా క్షయ నివారణ అధికారి పేర్కొన్నారు. అదే విధంగా కరోనా వ్యాధి పై కూడా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియ చేసారు, మరియు క్షయ వ్యాధి గ్రస్తులకు ఇచ్చే మందులు రోజు వారి పద్ధతిలో చరవాణి పద్ధతిలో గమనించుటకు వీలుగా ఉండేందుకు కొత్త పాకెట్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డా. ఎన్. వసుంధర, పి.ఓ.డి.టి.టి. డా., సూర్య నారాయణ, ఎపిడిమోలోజిస్ట్ డా., పార్థ సారథి, జిల్లా క్షయ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

# కరోనా వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

## నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం లాక్‌డౌన్‌లో భాగంగా పోలీసుశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలన్నారు. కరోనా వ్యాధిపై పుకార్లను నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా నివారణ చర్యల్లో భాగంగా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. పేద ప్రజలను ఆదుకోవటం కోసమే రేషన్ సరుకులు ఉచితంగా ఇవ్వడంతో పాటు, వెయ్యి రూపాయల నగదు కూడా ప్రతి ఇంటికి అందిస్తారన్నారు. ప్రాణాంతకమైన కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వానికి సహకరించాల్సిన ప్రతిపక్ష నేతలు కరోనాను కూడా రాజకీయం చేయడం శోచనీయమన్నారు. ప్రజలు స్వీయ నిర్బంధం పాటించాలి. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యాధి నివారణకు పోలీసులు, వైద్య సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లాక్ డౌన్‌కు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, టౌన్ సిఐ బిసిహెచ్.స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు తనయుడు దొరబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు మరింత వేగంగా స్పందించాలి

## పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు



విశాఖపట్నం: జిల్లాలో కోవిడ్-19 కేసులు వ్యాపించకుండా అధికారులు, సిబ్బంది మరింత కృషి చేయాలని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి ఆళ్ళకాళీ కృష్ణ శ్రీనివాస్ నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో పర్యాటకశాఖా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. జీవీఎంసీ పరిధిలో పారిశుద్ధ్య పనులు ప్రణాళిక ప్రకారం ముమ్మరం గావించాలన్నారు. కోవిద్ -19 అనుమానిత కేసుల విషయంలో ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నా వారిని అనుమతించి పంపించాలన్నారు. అందుకుగాను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులను గుర్తించి సేవలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనుమానిత కేసులు ఉన్న ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అధికారులు, సిబ్బంది పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు.

ఈ విషయంలో పూర్తి సహకారం అందించాలని పోలీసు కమిషనర్‌ను కోరారు. ఎయిర్‌పోర్ట్ వద్ద తనిఖీ నిమిత్తము ఇంకా ఉన్నత స్థాయి వైద్యాధికారిని నియమించాలన్నారు. అనుమానిత కేసులు తెలియగానే అధికారులు మరింత వేగంగా స్పందించాలని మంత్రి అవంతి శ్రీనివాస్ సూచించారు.

# 50వ వార్డులో ఉచితంగా మాస్కులు పంపిణీ

## పరిశుభ్రతతోనే కరోనా నియంత్రణ .. 50వ వార్డు టీడీపీ అభ్యర్థి ననపల వరప్రసాద్



మురళీనగర్ః గ్రేటర్ విశాఖ 50వ వార్డులో కరోనా వైరస్ నియంత్రణకు ఆ వార్డు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ననపల వరప్రసాద్ స్వచ్ఛందంగా ఉచితంగా ఇంటింటా మాస్కులను పంపిణి చేశారు. ఈ నందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కరోనాను నియంత్రించేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఇంటికే పరిమితం కావాలని కోరారు.

పరిశుభ్రతతోనే కరోనాను నియంత్రించవచ్చునని అన్నారు. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రపరుచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులలో బయటికి వెళ్ళేటప్పుడు మాస్కులను ధరించడంతో పాటు ఎక్కువగా ప్రజలు గుమిగూడవద్దని సూచించారు. నిత్యవనర వస్తువులకు మాత్రమే ప్రజలు బయటకు వెళ్ళి, వెంటనే రావాలని సూచించారు. నోరు, ముక్కు ద్వారా కరోనా వైరస్ ప్రవేశించకుండా మాస్కులను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధ్యతగా మెలగాల్సిన సమయమిది

## ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం: అత్యవసరమైతే తప్ప ప్రజలెవ్వరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా వైరస్ కారణంగా అమెరికా, ఇటలీ లాంటి ఎన్నో అగ్ర దేశాలు వణికిపోతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఒక్కరోజే అమెరికాలో కరోనా ప్రభావం భారీగా కనిపించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్‌ను మరింత కఠినంగా అమలు చేయనుందని ఆయన వెల్లడించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని విజ్ఞప్తి చేశారు. మనమంతా బాధ్యతగా.. సంఘీభావంగా మెలగాల్సిన సమయమిదని తెలిపారు. కరోనా కట్టడి చేయాలంటే ప్రజలంతా బాధ్యతగా ఉండాల్సిందేనన్నారు. ఇది ఏ ఒక్కరి సమస్యో కాదని.. మానవాళి ఎదుర్కొంటున్న జాతీయ విపత్తు అని ఆయన పేర్కొన్నారు.

# ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి క్రిష్ణదాస్


శ్రీకాకుళం : జిల్లా ప్రజలకు శార్వరీ నామ ఉగాది శుభాకాంక్షలను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనను మంగళ వారం విడుదల చేస్తూ శార్వరీ నామ సంవత్సరంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగువారి సంవత్సరాది ఉగాది అని అయితే కరోనా మహమ్మారి దృష్ట్యా ప్రతి ఒక్కరూ సురక్షిత చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరూ బయటకు రావద్దని ఆయన కోరారు. షడుచుల మేళవింపుతో కుటుంబాలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా సమష్టిగా పోరాడి, కరోనాపై విజయం సాధిద్దామని కోరారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని, పోలీసు శాఖ సూచనలు పాటించాలని కోరారు.

# విజయభాను సంపాదకీయం

## చైనా సక్సెస్ అయ్యింది

కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో చైనా సఫలమైంది. ప్రజలు క్రమశిక్షణతో మెలిగితే మన దేశమూ ఈ వైరస్‌ను మట్టి కరిపించడం అసాధ్యమేమీ కాదు. కానీ చైనాకు, మన దేశానికి వ్యవహారపరంగా ఎంతో తేడా ఉంటుంది. అక్కడ ఉన్నది ఏక పార్టీ నిరంకుశ వ్యవస్థ. కానీ ప్రజాస్వామ్యవ్యవస్థలో మన విలువలను, రాజనీతిని పణంగా పెట్టకుండానే, ప్రజల సహకారంతో కార్యాన్ని సాధించడం అసిధారా వ్రతం వంటిది. రాష్ట్ర ప్రజలు జనతా కర్ఫ్యూ పాటించిన తీరు అద్వితీయం. కానీ అంతలోనే సోమవారం నాడు లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత కూడా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చిన తీరు ఆందోళనకరం. సోమవారం మీడియా పెద్దలతో సమావేశమైన ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలు సహకరించడం లేదని ఆందోళన వెలిబుచ్చడం గమనార్హం. ఆదివారం జనతా కర్ఫ్యూ పాటించవలసిందిగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన తర్వాత, ప్రజలకు కర్తవ్య బోధ చేయడంలో సీఎం కేసీఆర్ నిర్వహించిన పాత్ర గణనీయమైనది. తెలంగాణ జాతి ఉద్యమకాలంలో చూపిన పట్టుదలను, క్రమశిక్షణను గుర్తుచేస్తూ అదే పట్టుదలను ఇప్పుడూ కనబరచాలంటూఉత్తేజపరచారు. ప్రజలు కేసీఆర్ పిలుపునకు స్పందించడం ఉద్యమకాలంలోనే కాదు, రాష్ట్రాన్ని సాధించి పరిపాలనా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా కొనసాగుతున్నది. కుటుంబ సర్వేకు సహకరించవలసిందిగా సీఎం పిలుపునిస్తే, ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలంగాణవారు స్వచ్ఛందంగా తరలివచ్చి నమోదు చేయించుకొని వెళ్లారు. ఇదేవిధంగా ప్రజలు ఆదివారం స్వచ్ఛందంగా ఇంటి పట్టునే ఉన్నారు. కానీ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ఈ క్రమశిక్షణ కనిపించకపోవడం గమనార్హం. కరోనా వైరస్‌ను ఎదుర్కొనడానికి సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వం మేరకు పరిపాలనా యం త్రాంగం ఎంత ప్రయాసపడుతున్నదో ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలు సహకరించకపోతే అహోరాత్రులు సేవలు చేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది కృషికి ఫలితం ఉండదు. కరోనా వైరస్ సోకిన రోగులను గుర్తించడానికి పగలు రాత్రి తేడాలేకుండా వేలాది బృందాలు తిరుగాడుతున్నాయి. అనుమానితుల ఇంటికి వెళ్లి వారు ఒంటరి జీవితం గడుపుతున్నారా, ఏవైనా రోగ లక్షణాలు కనిపిస్తున్నాయా అనేది ఆరాతీస్తున్నా యి. మృత్యువు కోరల దాపున చేరి, నిబద్ధతతో పనిచేస్తున్న వైద్యుల భద్రతకు అన్ని వసతులు సమకూర్చడంలోనూ ముఖ్యమంత్రి శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతినకుం డా పరిస్థితిని అదుపు చేయడంలో పోలీసులు నిర్వహిస్తున్న పాత్ర కూడా ప్రశంసనీయమైనదే. కరోనా సోకిన విదేశీయులు కరీంనగర్‌కు వచ్చి వెళ్లారని తెలిసిన వెంటనే వారు తిరిగిన ప్రదేశాలన్నీ జల్లెడ పట్టిన తీరు అపూర్వం. వారు ఏయే ప్రాంతాల్లో, ఏయే వాహనాల్లో తిరిగారు, ఎవరిని కలిశారు, ఎక్కడ ఆహారం తీసుకున్నారు తది తర విషయాలన్నింటినీ అనతికాలంలోనే పసిగ ట్టారు. తెలంగాణలో పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్' ను సీఎం కేసీఆర్ అమలుపరిచారు. షీ టీమ్స్ మొదలైన విభాగాల సేవలను ప్రశంసిస్తూ, పోలీసుల పనితీరును చెప్పి ఓట్లడిగిన ఏకైక పార్టీ తమదని కేసీఆర్ ఎన్నికల సమయంలో చెప్పడం గమనార్హం. ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో కరోనాపై పోరాడుతున్నాయనడానికి కరీంనగర్‌ను తార్కాణంగా చెప్పవచ్చు. కరీంనగర్‌లో విదేశీయుల ఉనికిని గమనించిన మొదటి మూడురోజుల్లోనే వంద బృందాలు రంగంలోకి దిగి లక్షా ఇరువై ఏడు వేల మందికి వైద్య పరీక్షలు జరిపాయి. మరోవైపు నగరపాలక సంస్థ చొరవతో వేయి మంది సిబ్బంది పారిశుధ్య కార్యక్రమం సాగించారు. ఆధునిక పద్ధతుల్లో స్ప్రే చేస్తూ నగరమంతా పనులు నిర్వహించారు. గత ఆరేండ్ల పాలనలో కేసీఆర్ పరిపాలనారంగాన్ని కర్తవ్యోన్ముఖులను చేయడంలోనూ ప్రజలతో మమేకం కావడంలోనూ సాగించిన కృషి ఫలితమిది. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో చైనా సఫలమైంది. ప్రజలు క్రమశిక్షణతో మెలిగితే మన దేశమూ ఈ వైరస్‌ను మట్టి కరిపించడం అసాధ్యమేమీ కాదు. కానీ చైనాకు, మన దేశానికి వ్యవహారపరంగా ఎంతో తేడా ఉంటుంది. అక్కడ ఉన్నది ఏక పార్టీ నిరంకుశ వ్యవస్థ. కానీ ప్రజాస్వామ్యవ్యవస్థలో మన విలువలను, రాజనీతిని పణంగా పెట్టకుండానే, ప్రజల సహకారంతో కార్యాన్ని సాధించడం అసిధారా వ్రతం వంటిది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అంతరం లేనప్పుడే పరిపాలన సమర్థంగా సాగుతుంది.

## దాస్య బాధితుల అంతర్జాతీయ స్మృతి దినోత్సవం (మార్చి 25)



1650-1860 సంవత్సరాల రెండు శతాబ్దాల మధ్య కాలంలో సుమారు 10-15 మిలియన్ల అఫ్రికన్లు పశ్చిమ ఆఫ్రికా నుండి అమెరికా దేశాలకు బానిసలుగా పంపబడ్డారు. వారిలో ఎక్కువ మంది వెస్టిండీస్, మధ్య అమెరికా, దక్షిణ అమెరికాలకు బానిసలుగా వెళ్లారు. అట్లాంటిక్ మహా సముద్ర ప్రాంతాల్లో జరిగిన ఈ బానిస వ్యాపారాన్ని ప్రారంభం కాక ముందే ఆఫ్రికాలో బానిసత్వం కొన్ని శతాబ్దాల పాటు కొనసాగింది. సాధారణంగా యుద్ధాలలో పరాజితులు బానిసలయ్యేవారు. అమెరికన్లు, ఐరోపా వారు సముద్రయానం ద్వారా కొత్త భూ భాగాలకు వలస వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. వారి అభివృద్ధి కార్యక్రమాలకు చౌకగా పనివారు అవసరం కావడం ట్రాన్స్ అట్లాంటిక్ బానిస వ్యాపారానికి దారి తీసింది. ప్రపంచ మానవ చరిత్రలో అమానుషంగా పెద్ద ఎత్తున సాగిన నిర్బంధ వలస ఇది. దాదాపు నాలుగు వందల ఏళ్ల పాటు కొనసాగింది. ఆ బానిసలను చిత్రహింసలకు గురిచేసి, హీనమైన స్థితిగతుల లో పనిచేయించేవారు. ఒక రకంగా చెప్పాలంటే యజమానులు బానిసల రక్తాన్ని తాగారు. వారి ద్వారా సామాజిక నిర్మాణం, ఉత్పత్తి జరిగాయి. బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఎన్నో ఉద్యమాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. చివరికి 1907 లో బ్రిటన్, అమెరికాలు చట్టబద్ధంగా బానిస వ్యాపారాన్ని నిషేధించాయి. ఈ బానిస వ్యాపారానికి కారణాలు, పరిణామాలు, అది నేర్పిన గుణ పాఠాలను భవిష్యత్ తరాలు తెలుసుకుని జాత్యహంకార వా దం, దురభిమానం గురించి జాగ్రత్త వహించాలని ఐక్యరాజ్య సమితి భావించింది. 2007 డిసెంబర్ 17 న చేసిన తీర్మానం ద్వారా ఏటా మార్చి 25 న తేదీన దాస్య బాధితులు- అట్లాంటిక్ బానిస వ్యాపార అంతర్జాతీయ స్మృతి దినంగా ప్రకటించింది.

## భారీ ఊరట : త్వరలో మహమ్మారి మాయం



న్యూయార్క్ : ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి త్వరలోనే దశలవారీగా తగ్గుముఖం పడుతుందని 2013లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత, జీవభౌతిక శాస్త్రవేత్త మైఖేల్ లెవిట్ అంచనా వేశారు. వేగంగా విస్తరిస్తున్న కోవిడ్-19 వ్యాప్తికి త్వరలోనే తెరపడుతుందని చెప్పారు. చైనాలో ఈ మహమ్మారి బారినపడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య తగ్గిన తరహాలోనే ప్రపంచ దేశాల్లోనూ కరోనా విస్త ృతి మందగిస్తుందని ఆయన పేర్కొన్నారు. చైనా తరహాలోనే అమెరికా సైతం త్వరలోనే కరోనా వ్యాప్తి నుంచి విముక్తి పొందుతుందని, ఇది శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్న సమయం? కంటే ముందే జరుగుతుందని లెవిట్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచే ఆయన ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులను నిశితంగా అధ్యయనం చేస్తున్నారు. ఈ మహమ్మారిని నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు భయాందోళనలను అధిగమించాలని, సామాజిక దూరం పాటించడం ద్వారా కోవిడ్-19 వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు.

**వాస్తవానికి దగ్గరగా లెవిట్ అంచనాలు**

కరోనా వైరస్‌తో చైనాలో దాదాపు 80,000 కేసులు నమోదవుతాయని, 3,250 మరణాలు సంభవిస్తాయని లెవిట్ ఫిబ్రవరిలోనే అంచనా వేయగా, సరిగ్గా చైనాలో అదే సంఖ్యలో 80,298 కేసులు, 3245 మరణాలు చోటుచేసుకోవడం గమనార్హం. చైనాలో కరోనా వైరస్ వ్యాప్తి ముమ్మరంగా సాగినా మార్చి 16 నుంచి నూతన రోగుల సంఖ్య స్వల్పంగా ఉందని గుర్తుచేశారు. ఈ మహమ్మారిని రూపుమాపే దిశగా మనం సరైన దిశలోనే సాగుతున్నామని లాస్‌ఏంజెల్స్ టైమ్స్‌తో మాట్లాడుతూ ఆయన చెప్పుకొచ్చారు. 78 దేశాల నుంచి ప్రతిరోజూ కొత్తగా నమోదయ్యే 50కి పైగా కేసులను ఆయన విశ్లేషిస్తూ వైరస్ వ్యాప్తిలో కొంత రికవరీ కనిపిస్తోందని అంచనా వేశారు.

మొత్తం కేసుల సంఖ్యను ఆయన పరిగణనలోకి తీసుకోకుండా రోజూ కొత్తగా నమోదయ్యే కేసుల్లో తగ్గుదలను ఆయన ప్రధానంగా పరిశీలిస్తున్నారు. కేసుల సంఖ్య ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నా ఈ వైరస్ వ్యాప్తి బలహీనపడు తున్నదనేందుకు స్పష్టమైన సంకేతాలు ఉఆన్నయని చెప్పారు. వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు సామాజిక దూరం పాటించడం, వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురావడం రెండూ కీలకమని అన్నారు. మొత్తం కరోనా కేసుల సంఖ్యను, కరోనా పాజిటివ్‌గా తేలిన సెలబ్రిటీలను ఫోకస్ చేస్తూ మీడియా ప్రజలను అనవసరంగా భయాలకు లోనుచేస్తోందని ఆయన అసంత ృప్తి వ్యక్తం చేశారు. వైరస్ బాధితులతో ఆస్పత్రులు నిండిపోవడంతో సామాజిక దూరం పాటించడం ద్వారా వైరస్‌ను అడ్డుకోవడం మంచిదని సూచించారు.

**అతిగా స్పందిస్తే అనర్థం**

కరోనా వైరస్ వ్యాప్తిపై అతిగా స్పందించడం మరో సంక్షోభానికి దారితీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనవసర భయాందోళనలతో నిరుద్యోగానికి దారితీయడం, ఆత్మహత్యలు పెరగడం వంటి విపరీత ధోరణులు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి ప్రతికూల ప్రభావాలనూ తోసిపుచ్చలేమన్నారు. ఫ్లూ కంటే ఈ వైరస్‌తో మరణాల రేటు ఎక్కువగా ఉన్నా ఇది ప్రపంచ అంతానికి దారితీయదని, వాస్తవ పరిస్థితి చెబుతున్నంత భయానకంగా లేదని లెవిట్ స్పష్టం చేశారు.

## తల్లీ, చెల్లీ, అన్నా దండం పెట్టి చెబుతున్నా..



ఆదిలాబాద్ : అమ్మా.. చెల్లీ... అన్నా దండం పెట్టి చెబుతున్నాం... ప్రయాణాలు చేయకండి....ఇళ్ళకే పరిమితం కండి... కరోనా వైరస్ నివారణకు సహకరించండంటూ వాహన దారులను వేడుకున్నారు ట్రాఫిక్ పోలీసులు... మనలో ఉందో లేదో ఎలా వస్తుందో కూడా చెప్పలేం, ఇంటిల్లిపాది, గ్రామం, దేశం సురక్షంగా ఉండాలంటే సహకరిం చండంటూ ఇలా రోడ్లపై తిరిగితే వైరస్‌ను కట్టడి చేయలేమని కోరారు...

పెద్దపల్లి కమాన్ చౌరస్తా వద్ద సోమవారం రాజీవ్ రహదారిపై వచ్చి పోయే ప్రయాణికులకు ఇలా మూకుమ్మడిగా దండాలు పెడుతూ వినూత్న కౌనెల్సింగ్ నిర్వహించారు పెద్దపల్లి ట్రాఫిక్ సిబ్బంది..

## నాలుగు రోజులు జనతా కర్ఫ్యూ

### పుదుచ్చేరి సీఎం నారాయణ స్వామి

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న నాలుగు రీజియన్లలో నాలుగు రోజులపాటు జనతా కర్ఫ్యూ పెడుతున్నట్టు పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణ స్వామి మంగళవారం ప్రకటించారు .ఈ మేరకు స్థానిక పరిపాలన అధికారి శివరాజ్ మీన పరిపాలన అధికారి కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి, కారేకల్, మహే, యానాం ప్రాంతాలలో 25 నుండి 28 వరకు జనత కర్ఫ్యూను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పాలు , మందులు షాపులు మినహా మిగతా షాపులన్నీ మూసివేయాలని ఇళ్లలో నుండి ఎవరు బయటికి రాకూడదని ఆయన హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కరోనా వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరీ సరోజ , ఎస్పి భక్తవాత్సల్యం , సీఐ శివ గణేష్, ఆరోగ్య అదికారి కాశి సత్యనారాయణ విధ్యా శాఖ అదికారి సాయినాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో

## భక్తుల దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

భీమునిపట్నం: ప్రపంచ దేశాలను వణికి స్తున్న కరోనావైరస్(కోవిడ్-19) విజృంభన నేప ధ్యంలో భీమునిపట్నం దరి కీటిన్ పేటలో ఉన్న శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారము జరిగే అన్నసమారాధన కార్య క్రమం తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగిందనీ ఆలయ ట్రస్ట్ సభ్యులు చెప్పారు. అంతేకాకుండా ఆలయంలోకి భక్తుల ప్రవేశం గూడ తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగిందనీ, కాని నిత్యం జరిగే పూజలు, అభిషేకాలు,కైంకర్యాలు మొదలగునవన్నియు ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి వారికి ఏకాంతంగా జరుగుతాయని, అలాగే ఉగాది ఉత్సవాలు మరియు పంచాంగశ్రవణం గూడ ఏకాంతంగా జరుగుతాయని, ఇవన్నీ కరోనా వ్యాప్తి అరికట్టేం దుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అని ప్రజలందరూ అర్థం చేసుకుని శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీకి సహకరిం చాలని ఆలయ ట్రస్ట్ సభ్యులు శ్రీ కలిగొట్ల శ్రీ రామ్, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, ట్రెజరర్ ఉసిరికల తాతాజి, దేవాలయం పురోహితులు శేషాచార్యులు తెలిపారు.

## పంచాంగం


| మాసం : ఫాల్గుణ ; తిథి : శార్వరి చైత్ర పాడ్యమి సా.3.53; రేవతి తె.5.49; సా.వ.4.30ల 6.17. | బుధవారం 25-03-2020 |
|---|---|

**మేషం :** ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిధునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం :** స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం˘మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపా రాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **కన్య :** ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. **తుల :** నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు :** వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యో గస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం :** ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంప తుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

# రాజసం ఉట్టిపడే రాతి నిర్మాణాలు

## సంకీర్తన

త్రికుటేశ్వరాలయం



సూర్యాపేటకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రిలో కాకతీయుల కాలంలో జీవం పోసుకున్న దేవాలయాలు, శిల్పకళా సంపద.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతిమలను, జీవిత ఘట్టాలను, జ్ఞానోదయ చిత్రాలతోపాటు శాంతి చిహ్నాలు తదితర సన్నివేశాలు, ఆరామ కుడ్యాలపై ఎంతో అద్భుతంగా చెక్కబడ్డాయి. బౌద్ధ శిల్పకళలో సహజ సుందర దృశ్యాలకు, పశు పక్షాదులకు కూడా స్థానం లభించింది. అయితే మత ప్రచారానికి తోడ్పడే విధంగా అది రూపాంతరం చెందింది. ఉత్తర దక్షిణ శిల్పకళా సంస్కృతుల సమ్మేళనంతో కొత్త తరహా శిల్పకళను ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత కాకతీయులకే దక్కింది. క్రీ.శ.1000 నుంచి 1324 వరకు కాకతీయరాజులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. ఇదే కాలంలో వారి సామంతులుగా, మాండలికులుగా నల్లగొండను పాలించిన రేచర్ల వంశస్థులు ఈ తరహా శిల్పాలను ఆదరించారు. వీటిలో భాగంగానే పిల్లలమర్రి, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాలు శిల్పుల మేధాశక్తి, కళలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఒకవైపు కాకతీయ సామ్రాజ్య సంరక్షణకు యుద్ధాలు చేస్తూనే మరోవైపు శిల్పకళను ప్రోత్సహించడం వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఆనాటి శిలలపై నగ్న దృశ్యాలు, సౌందర్య కుసుమాలు తదితర దర్పణంలాంటి చెక్కడాలు కళ్లను మైమరిపిస్తాయి.

**త్రికుటేశ్వరాలయం**

పిల్లలమర్రి గ్రామం ఉన్న త్రికుటేశ్వరాలయాన్ని కాకతీయుల రాజు అయిన రేచర్ల నామిరెడ్డి క్రీ.శ.1202లో నిర్మించారు. దుందుభి నామ సంవత్సరం చైత్రశుద్ధ ఏకాదశి శనివారం నాడు రాజు తన పేర నామేశ్వరలింగం ప్రతిష్ఠించి పూజాధికారులకు, దూపదీప నైవేద్యాలకు భూదానం ఇచ్చారు. ఈ విషయం వివరిస్తూ అక్కడ శాసనం కూడా రాయించారు. అదే ఆలయంలో మూడు శివాలయాలు ఏర్పాటు చేశారు. నామిరెడ్డి పేరు మీద నామేశ్వరాలయం మొదటిది కాగా, రాజు తన తల్లి పేరు మీద కాచేశ్వర, తండ్రి పేరున కామేశ్వర లింగాలను దేవాలయంలో ప్రతిష్ఠించాడని శాసనంలో ఉంది.

**దేవాలయాలతోపాటు పెద్దచెరువు**

పిల్లలమర్రిలో శిల్పకళా సంపద ఉట్టిపడే దేవాలయాలే కాదు.. త్రికుటేశ్వరాలయానికి అతి సమీపంలో పెద్ద చెరువు కూడా ఉంది. మూసీ నదిలో నీళ్లున్నంత కాలం ఆ చెరువులో జలకళ ఉట్టిపడుతుంది. **800 ఏళ్ల నాటి బావి**

ఎరుకేశ్వరాలయ ఆవరణలో 800 సంవత్సరాల క్రితం బేతిరెడ్డి భార్య ఎరుకసాని తాగునీటి కోసం తవ్వించిన బావి ఇప్పటికీ ఉంది. ఎంతటి వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు వచ్చినా ఆ బావిలో నీరు ఇంకిపోలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**త్రికుటాలయంలో ఆసక్తికరమైన నంది**

త్రికుటేశ్వరాలయంలో శివలింగాలను కాపాడేందుకు రేచర్ల నామిరెడ్డి నంది విగ్రహాన్ని చేశారు. ఆ నంది మూడు శివలింగాలను కాపాడుతున్నట్లు అనిపిస్తుంది. మూడింటిలో ఏ శివలింగం ముందు నిలబడి చూసినా నంది దాని వైపే చూస్తున్నట్లుగా కనిపిస్తుంది. అక్కడకు వచ్చే భక్తులు మూడు లింగాలను దర్శించుకొని వెళ్తుంటారు.



**FINANCE**
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
96665 47338

**బిజినెస్ ఆఫర్**
అవగాహన కోసం రాజమండ్రి వచ్చి రూ.1650లతో కొన్నవారికి, కొనిపించిన వారికి బహులాభాల అపూర్వ అవకాశం.
9393068546, 6300172408

# అపార్టుమెంట్‌ల వద్ద శుభ్రత చర్యలు




విశాఖపట్నం : స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సమర్ధంగా అమలు చేసిన సిబిఎన్ కాంపౌండ్‌లో ఒక అపార్ట్‌మెంట్ వాసులు తమ అపార్టుమెంట్‌ల్లోకి కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కొని అపార్టుమెంట్‌లో ప్రవేశించాలని నిబంధన విధించారు. సిబిఎన్ కాంపౌండ్ వీధి నెంబర్ 21లో లక్ష్మీనరసింహ నిలయంకు చెందిన నివాసితులు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

మిగిలిన అపార్ట్మెంట్ వాసులకు కూడా ఈ రకమైన చర్యలు చేపట్టడం ద్వారా అపార్ట్మెంట్ పరిసర ప్రాంతాల్లో కరోనా వైరస్‌కు సంబం ధించి విస్తరించకుండా ఉంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ కార్యదర్శి ఉదయ్‌కుమార్, నివాసితులు సన్‌మూర్తి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## విదేశాల నుంచి వచ్చిన యువకుడికి నోటీసులు

గొలుగొండ : మండలంలో ఏఎల్‌పురం గ్రామానికి సౌత్ ఆఫ్రికా దేశం నుండి వచ్చిన యువకుడుకి కేడిపేట వైద్యాధికారి ప్రణతి నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన యువకుడు సౌత్ ఆఫ్రికాలో ఉద్యోగం చేసి 10 రోజులు క్రితం అత్తవారి ఊరైనా శ్రీకాకుళం రావడం జరిగింది. అక్కడ నుంచి ఆదివారం కేడిపేట రావడంతో వైద్య సిబ్బంది ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి నెల రోజుల పాటు బయటకు రాకుండా ఉండే విధంగా నోటీసులు జారీ చేశారు.

## కరోనా వైరస్ వ్యాప్తి నిర్మూలనకు కలెక్టర్ చర్యలు అభినందనీయం

**ఎస్సీ,ఎస్టీ మిజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు నక్కా చిట్టిబాబు**



కాకినాడ : కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రజలను అప్రమత్తం చేయడంలో జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి తీసుకున్నచర్యలు అభినందనీయమని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు నక్కా చిట్టిబాబు అన్నారు.తన కార్యలయంలో పాత్రికేయలుతో చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచాన్నే వణికిస్తున్న అతిభయంకరమైన కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు అప్రమత్తతే ఏకైక మార్గమని ప్రజలను అప్రమత్తం చేడంలో జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసిన కలెక్టర్,జిల్లా ఎస్పీ నయీం అస్మిలు ప్రజలను చైతన్య వంతులను చేయడంలోను, జన సంచారాన్ని నిలువరించడంలోను సఫలీకృతులు అయ్యారన్నారు.జిల్లా ప్రజలు కలెక్టర్,వైద్య ఆరోగ్యశాఖ,పోలీసు శాఖ సూచనల మేరకు నడుచుకొంటూ కరోనా వైరస్‌ను తరిమి కొట్టేందుకు సహకరించాలన్నారు.

ముఖ్యంగా ఈ వైరస్ సోకకుండా చేతులను శా టైజర్లతో శుభ్రపరచుకొంటూ దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయరాదని సూచించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 31 వరకు లాక్ డౌన్ ప్రకటించిన నేపధ్యంలో పేద ప్రజలకు నిత్య వసరాలతో పాటు, రూ.1వెయ్యి ఆర్ధిక సహాయం ప్రకటించడంపై సీఎంకు చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు కాకిలేటి రవీంద్ర, రాష్ట్ర దళిత ఐక్య వేదిక అధ్యక్షులు మద్దా కృష్ణమూర్తి, సభ్యులు కురిమిన సత్యనారాయణ, తిరుపతి,రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బుడుమూరు రాజేష్‌కు వరించిన ప్రభుత్వ నామినేటెడ్ పదవి

కాకినాడ : ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ రిలేషన్ హెడ్ పనిచేస్తున్న బుడుమూరు రాజేష్‌కు అంబేద్కర్ యూనివర్సిటీ సిండికేట్ మెంబర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర జీఓను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌ను పలువురు అభినందనలు తెలిపారు. రాజేష్ ఇప్పటికే IIM- Raipur, CII, AP Chambers, JNTUK VC, Srikakulam జిల్లా కలెక్టర్ ద్వారా ప్రశంస పత్రాలు అందుకున్నారు. రాజేష్‌ను ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ కన్వీనర్‌గా JNTU, కాకినాడ పరిధి లోని దాదాపు 250 ఇంజనీరింగు కళాశాలకు గత కొన్నేళ్లుగా ఉపాధి కల్పనలో మరియు ఇంటర్న్షిప్‌లో విశేష సేవలు అందించడం, శ్రీకాకులం జిల్లా కు సంబంధించి స్కిల్ డెవలప్మెంట్ యాప్‌ను తయారు చేయడంలో కీలకపాత్ర పోషించడం, తద్వారా రిపబ్లిక్ డే అవార్డులు 2017, 2019 లో పొందడం మరియు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సేవలందిచడం మరియు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మంచి సంబంధాలు ఉండడం తో ఈ పదవి వరించింది. ఈ పదవిలో 3 సంవత్సరాలు కొనసాగుతారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



మాకవరపాలెం: ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ కార్యక్రమానికి ప్రజలు సహకరించకుంటే కేసులు నమోదు చేస్తామని మాకవరపాలెం ఎస్సై కరక రాము అన్నారు. వ్యాపార సంస్థలు మూసివేయడం, వాహనదారులు ఇళ్లు వదిలి ప్రయాణం చేయడం, ఇళ్లు వదిలి రోడ్లపై గుమిగూడి తిరగడం తదితర పనులు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రోడ్లపైన తిరిగే ప్రతీ 3,4 చక్రాల వాహనాలు, అంతకు మించిన పెద్ద వాహనాలు ఏవి తిరిగినా సీజ్ చేయబడతాయన్నారు. అలాగే మోటారు సైకిళ్ళను కూడా అనుమతింపబడవన్నారు.

ఊరికనే తిరిగే మోటార్ వాహనదారులపైన భారీ జరిమానాలు విధించి అవసరమైతే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. పభుత్వ నియమాలు తప్పకుండా పాటించాలని అలాగే మనల్నిమనమే రక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## లాక్‌డౌన్‌తో అంతటా నిర్మానుషం

నర్సీపట్నం: లాక్‌డౌన్‌తో నర్సీపట్నం రోడ్లు నిర్మానుషంగా మారాయి. సోమవారం లాక్‌డౌన్ ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోని రోడ్లపై యధేచ్ఛగా తిరిగారు.

దీంతో పోలీసులు గట్టి చర్యలు నేపధ్యంలో మంగళవారం ప్రజారవాణాను అడ్డుకున్నారు. ఎక్కడి కక్కడ పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో ప్రజల సంచా రం తగ్గింది. దీంతో రోడ్లన్నీ నిర్మానుషంగా మారాయి.



## కరోనా వ్యాధి ప్రబలకుండా సహకరించాలి

**వర్తక సంఘాలతో కలెక్టర్ మురళీధర్‌రెడ్డి**

కాకినాడ : వర్తకులు, వ్యాపారులు సామాజిక బాధ్యతతో తమ వంతు కర్తవ్యంగా కరోన వ్యాధి ప్రబలకుండా సహకరించాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆయన ఛాంబర్ ఆఫ్ కామర్స్,వర్తకులతో కలక్టర్ కార్యాలయంలో కరోన నియం త్రణ గురించి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగాకలక్టర్ మాట్లాడుతూ సడలించిన సమయాలలో ఎక్కువ మంది ప్రజలు గుమిగూడితే చాలా ప్రమాదమని సామాజిక దూరం పాటించేలా వర్తకులు,అధికారులు చూడాలన్నారు. ఉదయం 9.30 గంటల కల్లా వ్యాపార సంస్థలు మూసివేస్తే బాగుంటుందని,దాని వలన అవసరమైన వారు వచ్చి వస్తువులను కొనుగోలుచేయడానికి అవకాశం ఉంటుందన్నారు.మందులు షాపులు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువుల వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడకుండా చూడాలన్నారు. రైతు బజారుల్లో ఎక్కువ గుమిగూడకుండా

వాటిని వికేంద్రీకరణ చేయాలన్నారు. ప్రస్తుతం విద్యా సంస్థలు మూసి ఉన్నందున ఆ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమగు కూరగాయలను ఉంచినట్లైతే ఎక్కువ మంది ఒక చోట గుమిగూడటం జరగదన్నారు.తరువాత ఎట్టి పరిస్థితుల్లోను ఏవస్తువైనా ఎం.ఆర్.పి.కంటే ఎక్కువ అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.జాయింట్ కలక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నూటికి నూరు శాతం జనాభా షాపుల దగ్గర గుమిగూడకుండా నిబంధనల ప్రకారం సామాజిక దూరం అమలు చేయాలన్నారు. ఒక అర శాతం ఉల్లంఘన జరిగితే మొత్తానికే ముప్పు వస్తుందని, ఈ విషయంపై వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఎవరైనా సరే నిబంధనలు అతిక్రమిస్తే వారి షాపు లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈసమావేశంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ అభిషిక్ కిషోర్‌తో పాటు కార్మిక శాఖసహాయ కమీషనర్ ఎన్.బుల్లిరాణి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కె.రమేష్, జెసి-2జి.రాజకుమారి, డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు, జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు సంబంధించిన మున్సిపల్ కమీషనర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైవాడ లో కరోనా పై కరపత్రాల ప్రచారం



దేవరాపల్లి : ప్రపంచాన్ని వణికిస్తున్న మహమ్మారి కరోనా పై మండలంలోని రైవాడ గ్రామ ప్రజలకు స్థానిక హెల్ప్ ఫుల్ హాండ్స్ సామాజిక సేవా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్తలు కరపత్రాలు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కరోనా వైరస్ పై ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన మార్గదర్శక సూత్రాలను వారి సొంత నిధులతో కరపత్రాన్ని ముద్రించి మంగళవారం సంస్థ కార్యకర్తలు ఇంటింటా పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కరోనా పై ఆందోళన చెందవద్దు జాగ్రత్తలు పాటించండి. చేతులను తరచూ శుభ్రపరచుకోవాలి అని, సామాజిక దూరాన్ని పాటించాలని, మాస్కు ఎప్పుడు ఎలా ధరించాలి అవగాహన కల్పించారు. గ్రామంలో వీరు చేసే ప్రయత్నాన్ని గ్రామ పెద్దలు, స్థానికులు అభినందనలు తెలిపారు.


## ఉచితంగా ఉల్లిపాయలు పంపిణీ



నర్సీపట్నం: ప్రజలు కరోనా వ్యాధికి భయపడి ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో నర్సీపట్నం 1, 2 వార్డుల్లో మాజీ కౌన్సిలర్ మాకిరెడ్డి విజయకుమారి భర్త మాకిరెడ్డి అప్పారావు వార్డు ప్రజలకు ఉచితంగా ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రజలు కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండా లన్నారు. స్వయనియంత్రణ పాటించాలన్నారు.

## కర్ఫ్యూను తలపించిన లాక్ డౌన్

**- నిన్న కళకళ - నేడు వెల వెల**



దేవరాపల్లి : కరోనా వైరస్ పై సీరియస్‌గా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అను గుణంగా మండల స్థాయి అధికారులు తూ.చా పాటిస్తున్నారు ఆదివారం జనతా కర్ఫ్యూ మినహా వెంటనే సోమవారం మండల కేంద్రం దేవరాపల్లితో పాటు గ్రామీణ ప్రాంతాలు కళకళలాడాయి దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 31 వరకు లాక్ డౌన్ పాటించాలని పిలుపునివ్వడంతో దీన్ని సాదాసీదాగా తీసుకున్న ప్రజలు రోడ్లు మెదకు వచ్చి విచ్చలవిడిగా తరలివచ్చారు. దీంతో ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకోవడంతో మండలస్థాయి అధికారులు పోలీసులు ప్రత్యేక చర్యలు కు సిద్ధపడ్డారు. సోమవారం సాయంత్రం మరలా హెచ్చరికలు జారీ చేయడంతో మంగళవారం జనతా కర్ఫ్యూ తలపించేలా రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వీధులన్నీ వెలవెలబోయాయి. ఎస్ఐ పి. నరసింహమూర్తి సారథ్యంలో పోలీసులు రోడ్లపై పహారా కాశీ ప్రజలు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్ రక్షక్ ద్వారా మైక్ ప్రచారం చేసి అందరిని అప్రమత్తం చేయడంతో తిరిగి ఆదివారం నాటి పరిస్థితి అదుపులోకి వచ్చింది. వాలెంటర్లు, గ్రామ కార్యదర్శులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## అనాధలకు, రోగుల సహాయకులకు ఆహార పొట్లాలు అందజేసి, ఆకలి తీర్చిన శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ



విశాఖపట్నం : కరోనా మహమ్మారి కారణంగా... ఆకలితో అలమటిస్తున్న... అనాధలకు, రోగుల సహాయకులకు, నిరుపేదలకు, కూళీలకు..శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆహార పొట్లాలు అందజేసి వారి ఆకలి తీర్చింది. కేజిహెచ్, ఘోషా ఆస్పత్రికి.. వచ్చిన రోగుల సహాయకులకు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లు, ఫుట్ పాత్ లు, రోడ్లపై జీవనం సాగించే అనాధలకు.. వారి దగ్గరకు వెళ్లి ఆహార పొట్లాలు అందజేసింది. లాక్ డౌన్ కారణంగా.. జీవనోపాధి కోల్పోయి.. కూలీలు పస్తులు ఉంటున్నారు. భోజన హొటల్స్ లేకపోవడంతో రోగుల సహాయకులు

పస్తులుంటున్నారు. ఆహారం అందించే వారు లేక అనాధల పరిస్థితి దయనీయంగా మారింది. వీరి ఆకలి బాధల గురించి తెలుసుకున్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.. ప్రమాదకర పరిస్థితుల్లో కూడా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వారంతా ఎక్కడ ఉన్నారో? అక్కడికే వెళ్లి భోజనం పొట్లాలు అందజేసి సంస్థ సభ్యులు వారి ఆకలి తీరుస్తున్నారు. ఎవరైనా భోజనాలు కావాల్సి వస్తే కింద ఇచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు విజ్ఞప్తి చేశారు. వెంటనే వారికి భోజనాలు అందజేస్తామని వెల్లడించారు. మొబైల్ నెంబర్లు: 77994 48555, 96662 93081, 84979 69692, 82975 68913, 89785 44468



# కరోనా నివారణకు ప్రజలు సహకరించాలి

**నాతవరం ఎస్సై రమేష్**

నాతవరం: కరోనా నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రక టించిన నేపధ్యంలో ఎవరు బయటకు రావద్దని నాతవరం ఎస్సై జె.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అత్య వసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని, పబ్లిక్, ప్రైవేటు వాహనాలకు కూడా అనుమతులు లేవన్నారు. ఆటోలను పూర్తిగా నిషేదించామన్నారు.

కరోనా వ్యాధి దృష్ట్యా ప్రజలంతా సహకరించాలని, ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ఉంటుందని చెప్పారు. ఎక్కడా కూడా గుంపులు గుంపులుగా వ్యక్తులు సంచరించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# మూడు లక్షల 50 వేల రేషన్ కార్డులకు ఒక్కొక్క రేషన్ కార్డుకి రెండు వేల ఆర్థిక సాయం అందించనున్నాము

**సీఎం నారాయణస్వామి**

యానాం : కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లోని ఉన్నటువంటి మూడు లక్షల 50 వేల రేషన్ కార్డులకు ఒక్కొక్క రేషన్ కార్డుకి రెండు వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి ప్రకటించారు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ప్రజలను ఇంటికే పరిమితం కావాలని ఈనెల 31 వరకు విధించడం వల్ల ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబానికి పుదుచ్చేరి రాష్ట్ర బడ్జెట్ నుండి ప్రతి కుటుంబానికి రెండు వేల రూపాయల చొప్పున అందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# విదేశీ వ్యక్తులపై ప్రత్యేక నిఘా



దేవరాపల్లి : విదేశాల నుంచి తరలి వచ్చి గుట్టిగా ఉన్న వారిపై వైద్య బృందం ప్రత్యేక నిఘా పెట్టింది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఒక ప్రక్క అధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మరో ప్రక్క విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులు కదలిక పై అధికార యంత్రాంగం ఒక కన్నేసి ఉంది ఇటీవలే సౌదీ అరేబియా మలేషియా, దుబాయ్, సింగపూర్ తదితర దేశాల నుంచి దేవరాపల్లి వచ్చిన వ్యక్తులను కలిసి పలు జాగ్రత్తలపై ఆదే శాలు సూచనలు అందించారు. దీంతోపాటు ఏఎన్ఎం ఆశా వర్కర్లు, వాలెంటర్లు, ప్రత్యేక సూచనలు చేస్తూ అవసరమైన చోట మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో మండల స్థాయి బృందం, గ్రామస్థాయి బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి.

వీరితోపాటు తహశీల్దార్ జె.రమేష్‌బాబు, ఎస్ఐ పి.నరసింహమూర్తి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, వైద్య అధికారిణి ఎస్. లలిత అందుబాటులో ఉండి పరిస్థితులను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసు కుంటున్నారు.

ప్రజలకు కరోనా వైరస్ తీవ్రత పై అవగాహన కల్పించడంలో అధికార యంత్రాం గం ముందు దనే చెప్పవచ్చు ప్రజలంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలను పాటించి సహకరించాలని అధికార బృందాలు కోరాయి.

# పూటకో మాట... రోజుకో కండువా

**- కాశీపురం సెగ్మెంట్‌లో ఆగని జంపు జలానీలు - వీరి తీరుపై పలువురు విస్మయం**



దేవరాపల్లి : దేశమంతా కరోనా వైరస్ గురించి ఆలోచించి వణికిపోతుంటే... మండలంలోని కాశీపురం ఎంపీటీసీ సెగ్మెంట్ లో మాత్రం రాజకీయ సమీకరణాలు పై మొగ్గ చూపుతూ రోజుకో మలుపు తిరుగుతున్న తీరు ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ప్రకటించిన నాటి నుంచి మొదలైన ఎన్నికల వేడి నేటికీ కొనసాగుతూనే ఉంది. ఈ ఎన్నికలు వాయిదా పడి కరోన పై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటన చేస్తున్నా, రాజకీయాలు పక్కనపెట్టి వైరస్ వ్యాధి నియంత్రణకు చర్యలు చేపడుతున్న తరుణంలో ఇక్కడ జంపు జలానీల గొడవ తేలలేదు, ఈ నెల 6వ తేదీ నుంచి మొదలైన ఈ జంపు జిలానీల వ్యవహారం పై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే నిన్న వేరే పార్టీలోకి వెళ్లిన వారు తిరిగి మళ్లీ అదే పార్టీలోకి వచ్చి కండువాలు మార్చుకోవడం చూస్తుంటే ఈ సెగ్మెంట్ లో రాజకీయం ఎంత ముదిరింది దో అర్థమవుతుంది. తాజాగా సోమవారం వైసీపీ నుంచి టిడిపి తీర్థం పుచ్చుకున్న వారిలో నాగయ్య పేట పంచాయతీకి చెందిన చిరికి నాగమయ్య, చొక్కాకుల సింహాచలం నాయుడు, వంక చిన్నారావు, వనుం మహేష్ లు ఉన్నారు. అయితే చొక్కాకుల సింహాచలం నాయుడు మినహా మిగిలిన ముగ్గురూ మరల వైసీపీ నాయకుల సమక్షంలో మంగళవారం వైసీపీ లో చేరిపోయారు. ఇదిలా ఉండగా కాశీపురం పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు రెడ్డి సింహాద్రి అప్పుడు, కిలపర్తి పైడితల్లి, సబ్బవరపు ఈశ్వరరావు, రెడ్డి పైడిం నాయుడు, సింగంపల్లి నాని, ఆదిరెడ్డి శ్రీను, తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇదండీ కాశీపురం ఎంపిటిసి సిగ్మెంట్ రాజకీయ పరిస్థితి.



# ఏఎస్సార్ నగరవాసులకు రేషన్ పంపిణీ



కంచరపాలెం : 45 వార్డు ఏఎస్సార్ నగర్ కోలని నిర్వాసితులకు మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన రేషన్ సరుకులు ఉత్తర నియోజవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అందజేశారు. వాస్తవానికి ఈ రేషన్ సరుకులు 29 నుండి ఇవ్వాలి కానీ ఇక్కడ నివసించే వారంతా రోజు వారి కూలి చేసుకుని కుటుంబ పోషించేవారు ప్రస్తుతం కరోన ప్రభావితం కారణంగా పనులు లేక తమకు ఆహారం లేదని తమకు ముందుగానే రేషన్ సరుకులు అందజేయాలని మీరంతా సివిల్ సప్లై అధికారులకు విన్నవించు కున్నారు. అధికారుల ఆదేశాల మేరకు వారికి మాత్రం రేషన్ డిపో 570- లో ఉత్తర నియోజవర్గ సమన్వయకర్త శ్రీ.కె.కె.రాజు గారు, చేతులు మీదుగా బియ్యం, పప్పు, పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్, పైడి రమణ, హరిపట్నాక్, సన్నీ, దుర్గేష్, ఆదిలక్ష్మి, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సామాజిక సేవ అభినందనీయం : కలెక్టర్, ఎస్పీ



కాకినాడ : కరోనా వైరస్ పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తూ... జర్నలిస్టులు చేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాం నయిమ్ అస్మి కొనియాడారు.కాకినాడ చిన్న,మధ్య తరహా పత్రికా విలేకరుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా జర్నలిస్టులకు చేతి రుమాళ్ళు, సబ్బులను,శానిటేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతమున్న క్లిష్టమైన పరిస్థితుల్లో కరోనా కట్టడికి అధికారులు, పోలీసులు, వైద్యులతో బాటుగా జర్నలిస్టులు కూడా ఎంతో శ్రమిస్తున్నారని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ప్రజలకు విశ్వసనీయంగా సమాచారం అందించాలని సూచించారు. సంఘ అధ్యక్షుడు రాయవరపు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కోనకుండా తమ సంఘం ఆధ్వర్యంలో తోటి పాత్రికేయులకు చేతిరుమాళ్ళు, సబ్బులు, శానిటైజర్ లిక్విడ్ పంపిణీ చేయడం జరిగిందని,అలాగే ఇటీవల మాస్క్ పంపిణీ చేశామన్నారు.అంతేకాకుండా తమ సంఘ సభ్యులు ఇద్దరిద్దరుగా వెళ్ళి కరోనా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ,వారికి మాస్కులు, శానిటైజర్లు, అందించడం జరుగతుందన్నారు.కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ కాకినాడ చిన్న మద్యతరహా పత్రికల సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేడం జరుగుతందని... ప్రస్తుతం కరోనా మహమ్మారి నుండి తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర సమాచారాన్ని ఎప్పటి కప్పుడు ప్రజలకు చేరవేసే పాత్రికేయుల రక్షణకు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు జర్నలిస్టుల ఐక్యత చాటేందుకు ఉగాది,రంజాన్, క్రిస్మస్ వంటి పర్వాదినాలు జరుపుతూ సహపంక్తిభోజనాలు చేడం జరిగేదని,కరోనా నేపద్యంలో ఈఉగాది పర్వదినం జరుపడం లేదన్నారు.



# అన్ని అసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి

**బియ్యంకార్డుతో నిమిత్తం లేకుండా రేషన్ అందరికీ అందించాలి : సిపిఎం పార్టీ డిమాండ్**

విశాఖపట్నం : కోవిడ్-19 వైరస్ రోజు రోజుకు విస్తరించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31వరకు లాక్‌డౌన్ ప్రకటించడాన్ని సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పటల్స్‌లో అన్ని రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, బియ్యంకార్డుతో నిమిత్తం లేకుండా అసంఘటితరంగ కార్మికులందరికీ ఉచిత రేషన్ అందించాలని సిపిఎం గ్రేటర్ విశాఖనగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కరోనావైరస్ మహమ్మారిని విస్తరించకుండా ఈ నెల 31వరకు ఇంట్లో బయటకు రావద్దని చెప్పిన ప్రభుత్వం అదే సమయంలో జలుబు, దగ్గు, జ్వరం లాంటి చిన్న చిన్న జబ్బులు చేసేవారికి వైద్యం అందటం లేదని విమర్శించారు. కేజిహెచ్, విమ్స్ లాంటి హాస్పటల్స్‌లో కరోనా బాధితులకు మాత్రమే వైద్యం అందిస్తున్నారని వైద్య సిబ్బంది పరిపడ లేరని తెలియజేశారు. ప్రభుత్వ హాస్పటల్స్‌తో పాటు ప్రైవేట్ హాస్పటల్స్‌లోను, డిస్పెన్సరీలలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపున ఆటో, ముఠా, తోపుడుబండ్లు, బిల్డింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, షాపుల్లో పనిచేసే కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బియ్యం కార్డు ఉన్న వారికి మాత్రమే ఈ నెల 29న రేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పటికే బియ్యంకార్డు అత్యధికమందికి అందలేదు. బియ్యంకార్డు, రేషన్‌కార్డు ఉన్నవారితో పాటు అసంఘటితరంగ కార్మికులకు కూడా ఉచితరేషన్ పంపిణీ చేయాలన్నారు.

# ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

**జన సైనికుడు పీతల మూర్తి యాదవ్**



విశాఖసిటీ : ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జన సైనికుడు పీతల మూర్తి యాదవ్ పిలుపునిచ్చారు. కరోనా పై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 22 వ వార్డు పరిధిలోగల వివిధ ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లే కార్యక్రమాన్ని ఆయన జనసైనికులతో కలిసి నిర్వహించారు. శివాజీ పాలెం, పీతల వాని పాలెం, మంగాపురం కాలనీ, తార మసీద్, తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరు వైపులా బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు మందులు లేనందున వైరస్ నియంత్రించాలంటే స్వీయ నిర్బంధ మే మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం, పరిశుభ్రత పాటించాలని కోరారు. తద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలియజేశారు. ఈ వార్డు పరిధిలో ప్రతి ఒక్కరిలోనూ కరోనా వైరస్ పై చైతన్యం తీసుకొచ్చేందుకు జనసైనికులు అంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైరస్ వ్యాప్తి నియంత్రణలో నిరంతరం అంకితభావం, బాధ్యత, నిబద్ధత లతో పనిచేస్తున్న వైద్యులకు, పోలీసు లకు, వారికి సహకరిస్తున్న సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బంగారరాజు, అసిస్టెంట్ రమేష్ , గోపి, సూరి తదితరులు పాల్గొన్నారు.

# ట్రెండి గ్రూప్ సామాజిక సేవ



యానాం : ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి చెంద కుండా అధికారులు, పోలీసులు ఎక్కడెక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అదుపు చేస్తున్న తరు ణంలో యానాం నియోజకవర్గంలోని ట్రెండి సోషల్ మీడియా గ్రూప్ సభ్యులు చెక్ పోస్టుల వద్ద ఉన్న వారికి మజ్జిగ ఫ్రూట్స్ రాత్రి పూట టీ లు అందించి మానవత్వాన్ని చాటుకుంటు న్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పది చెక్పోస్టు వద్ద సిబ్బంది రాత్రి పగలు విధులు నిర్వహిస్తుం డగా కర్ఫ్యూ కారణంగా షాపులు మూసి వేయడంతో వారికి సదుపాయాలు అందక పోవటం గుర్తించిన ఈ ట్రెండి సభ్యులు మాన వత్వంతో ముందుకు వచ్చి వారికి అవసరమైన సదుపాయాలను సకాలంలో అందిస్తూ మాన వత్వాన్ని చాటుకుంటున్నారు.

# జనతా కర్ఫ్యూ మరో నాలుగు రోజులు పొడిగింపు

**పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి**

యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన వ్యాప్తంగా ఉన్న నాలుగు రీజియన్ లో మరో నాలుగు రోజులపాటు జనతా కర్ఫ్యూను పొడిగించాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి మంగళవారం ప్రకటించారు ఈ మేరకు స్థానిక పరిపాలన అధికారి శివరాజ్ మీన పరిపాలన అధికారి కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి, కారేకల్, మహే, యానాం ప్రాంతంలో 25 నుండి 28 వరకు జనత కర్ఫ్యూను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పాలు, మందులు షాపులు మినహా మిగతా షాపులన్నీ మూసివేయాలని ఇళ్లలో నుండి ఎవరు బయటికి రాకూడదని ఆయన హెచ్చరించారు ఈ నిబంధనలు ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు కరోనా వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరీ సరోజ, ఎస్పి భక్తవచలం, సీఐ శివ గణేష్ ఆరోగ్య అదికారి కాశి సత్యనారాయణ విద్యాశాఖ అధికారి సాయినాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు

# విశాఖలో లాక్‌డౌన్ దృశ్యమాలిక



నిర్మానుష్యంగా మారిన ఎల్ఐసి అంబేద్కర్ జంక్షన్, ఆర్ఆర్ గ్రాండ్ సర్కిల్




మనుష్య సంచారం లేక వెలవెలబోయిన నగరంలో ప్రముఖ కూడలి






కరోనా వైరస్ ఉద్ధృతంగా మారుతున్న తరుణంలో విశాఖ నగర ప్రజలంతా లాక్ డౌన్‌ను స్వచ్ఛందంగా అమలు చేస్తున్నారు. దీంతో నగరంలోని ప్రముఖ కూడళ్లు మనుష్య సంచారం లేక వెలవెలబోతున్నాయి. నగరంలో ప్రధాన కూడలి జగదాంబ జంక్షన్








వాహనదారులకు హెచ్చరికలు జారీచేస్తున్న కంచరపాలెం ఎస్ఐలు



వాహనదారులకు హెచ్చరికలు జారీచేస్తున్న ఏసీపీ స్వరూప



## వినకపోతే కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుంది : కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటివరకు 36 కేసులు పాజిటివ్ కేసులు నమోదయ్యాయని సీఎం కేసీఆర్ వెల్లడించారు. బాధితుల్లో ఎవరికీ సీరియ స్‌గా లేదన్నారు. అందరూ కోలుకుంటున్నారని చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధితులంతా ఏప్రిల్ ఏడో తేదీ వరకు డిశ్చార్జి అయిపోతారు. ఈ లోపు కొత్త కేసు రాకపోతే మనం జీరోకి వెళ్లే ఆస్కారం ఉంటుంది. అందువల్ల ముందు జాగ్రత్త చర్యలు మాత్రం గట్టిగా తీసుకోవాల్సి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మహమ్మారి ఇంచుమించు 191 దేశాలకు పాకింది. సోకనటువంటి దేశమే లేదని వార్తలొస్తున్నాయి. రాష్ట్రంలో 114 మంది కరోనా అనుమానితులు ఉన్నారు. 82




మంది విదేశాల నుంచి వచ్చినవారు కాగా.. 32 మందికి సోకి ఉండవచ్చు అనే అనుమానం ఉంది. రేపటికల్లా ఫలితాలు వస్తాయి. ఈ జబ్బు చాలా పెద్ద మహమ్మారి. యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ఇది పరిమిత సమస్య కాదు. అందరం అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు మంచి పద్ధతిలోనే చెప్పి ముందుకుపోయేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రజలు దానికి 100 శాతం సహకరించాలి. అమెరికాలాంటి దేశం స్థానిక పోలీసులు కంట్రోల్ చేయలేక ఆర్మీని దింపింది. మన దగ్గర కూడా ప్రజలు పోలీసులకు సహకరించకపోతే ఆటోమెటిక్‌గా 24గంటల కర్ఫ్యూ పెట్టాల్సి వస్తుంది. కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుంది. అప్పటికీ కంట్రోల్ కాకపోతే ఆర్మీని మోహరించాల్సి వస్తుంది. ఈ పరిస్థితి తెచ్చుకుందామా ఆలోచించండి. మనకు మనమే పాటించాలి. ఒక వ్యక్తితో ఈ వైరస్ పది, 100 మందికి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో చర్యలు ఆపదు. మనమే జాగ్రత్తగా ఉండి ముందు కు పోతే మంచిదని విజ్ఞప్తి చేస్తున్నా అని కేసీఆర్

## ఘనంగా శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక తారకరామ కోలనిలో కొలువైయున్న శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది.గ్రామంలో కరోనా వైరస్ కారణంగా 144 కర్ఫ్యూ విధించడం వలన పోలీసులు అమ్మవారి ఆలయ వద్ద బందోబస్తుగా ఉండి భక్తులను గుడి బయట నుండే గుంపులు గుంపులుగా కాకుండా విడివిడిగా ఒక్కొక్కరు దర్శనములు చేసుకునే విధంగా చాలా కట్టుదిట్టమైన చర్యలు ఏర్పాటు చేసారు.అమ్మవారికి భక్తులు తమ శక్తి కొలది మ్రొక్కులు చెల్లించుకున్నారు.

నూకాలమ్మ తల్లి చల్లని తల్లని,భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లని ఇక్కడ ప్రజల విశ్వాసం.గ్రామస్థులు అందరూ అమ్మవార్ని దర్శించి తీర్ద,ప్రసాదములు స్వీకరించారు. అదేవిధంగా అన్నవరం అత్తింటి ఆడపడుచు అయిన మండపం శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ వారిని కూడా కరోనా వైరస్ కారణంగా భక్తులు.గ్రామస్థులు గుడి బయట నుండే దర్శించుకుని తీర్త,ప్రసాదములు స్వీకరించారు.

# ప్రభుత్వ యంత్రాంగ చర్యలు అభినందనీయం

- రాష్ట్ర వ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు 7, విశాఖలో 3
- రాష్ట్రానికి విదేశాల నుండి వచ్చిన వారు 14,038 మంది
- అనుమానాస్పద కేసులు 220, నెగిటివ్ 168, రిపోర్టులు అందాల్సినవి 45
- సామాజిక దూరం పాటించాలి, అధికారులకు సహకరించాలి
- కరోనా నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని)



విశాఖపట్నం: రాష్ట్ర స్థాయిలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు 7 ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం కరోనా వైరస్ నివారణపై అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఉడా చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి విదేశాల నుండి వచ్చిన వారు 14,038 మంది ఉన్నారన్నారు. 28 రోజులు పరిశీలనలో ఉన్నవారు 11,526 మంది ఉన్నారని చెప్పారు. అనుమానిత కేసులు 220 మంది కాగా ఇందులో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు 7 ఉన్నాయని పేర్కొన్నారు. నెగిటివ్ 168 మంది ఉన్నారని, రిపోర్టులు రావలసినవి 45 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. కరోనా నివారణకు ప్రభుత్వం అన్నిరకాలలుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. విశాఖపట్నంలో 3 పాజిటివ్ కేసులు ఉన్నాయని చెప్పారు. కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. లాడ్ డౌన్ పటిష్టంగా అమలు చేయడానికి విశాఖ జిల్లా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలంతా సామాజిక బాధ్యతగా సామాజిక దూరాన్ని ప్రతీ ఒకరు పాటించాలని చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఇంటికే పరిమితం కావలని స్పష్టం చేశారు. లాక్ డౌన్ ప్రకటించక ముందే విద్యా సంస్థలు బంద్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ముందు జాగ్రత చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. 10వ తరగతి పరీక్షలు ప్రభుత్వం వాయిదా వేసినట్లు చెప్పారు. ప్రక్క రాష్ట్రాలు లాక్ డౌన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమణించి వారి బాధ్యతను నిర్వహించాలన్నారు. జిల్లా ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. విశాఖపట్నంలోని ఐసోలేషన్ వార్డులు విమ్స్ లో 200 పడకలు, కెజిహెచ్ లో 200 పడకలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందుకు కావలసిన వసతులు ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు. కరోనా వైరస్ రెండవ దశలో బంధువులకు, స్నేహితులకు చేరుతుందని, మూడవ దశలో ప్రలకు వ్యాప్తి చెందడం జరుగుతుందని తెలిపారు. విశాఖ జిల్లా ప్రజలు అప్రమత్తతతో ఉండాలని, కరోనా వైరస్ నివారణకు కఠినమైన నిర్ణయాలకు ప్రభుత్వం వెనుకాడదని ఆయన స్పష్టం చేశారు. లాక్ డౌన్ సమయంలో రోజు వారీ కూలీలను, పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి నెలకు రేషన్, కందిపప్పు, ఖర్చుకు రూ.1000/-లు పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలో కరోనా వైరస్ నివారణకు ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వ ఆదేశాలను జిల్లాలో ఏర్పాటుచేసిన 20 కమిటీలు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నట్లున ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన జాబితా ప్రకారం విదేశాల నుండి వచ్చిన వారు 1470 మంది కాగా వారు హోం క్వారంటైన్ లో ఉన్నారని, మరో 2400 మంది జాబితా వచ్చిందని వారిని ఈ రోజు సాయంత్రం నాటికి గుర్తించడం జరుతుందన్నారు. హోం క్వారంటైన్ లో ఉన్న వారు జిల్లా యంత్రాంగానికి ఎవరైనా సహకరించకపోతే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విదేశాల నుండి వచ్చిన వారు ఎవరైనా హోం క్వారంటైన్ పాటించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లోకి విదేశాల నుండి వచ్చిన ప్రతీ 10 మందికి ప్రతీ పంచాయితీకి ప్రత్యేక అధికారి ఉంటారని తెలిపారు.



జిల్లా ఇన్ చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో 3 పాజిటివ్ కేసులు ఉన్నాయని, కరోనా నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు సంతృప్తికంగా ఉన్నాయన్నారు. జిల్లాలో మాస్క్ లు కొరతగా ఉన్నాయని, విశాఖపట్నంలో అవసరం లేకపోయినా ప్రజలు రోడ్లపైకి వస్తున్నట్లు చెప్పారు. లాక్ డౌన్ ను తీవ్రంగా పరిగనించాలని నగర పోలీసు కమీషనర్ కు సూచించారు. ఫార్మా కంపెనీలు, కనీస ఉద్యోగులుతో పనిచేయించుకోవాలని, ఆయిల్ కంపెనీలు, పోర్టులు ఎంత మంది సిబ్బంది అవసరమో అంత మందిని వినియోగించుకోవాలన్నారు. సామాజిక దూరం పాటించాలని, ఇరుకుగా ఉన్న రైతు బజార్లు స్కూల్ మైదానలలోకి మార్చాలని చెప్పారు.

సీతమ్మధార రైతు బజారును ఎస్.ఎఫ్.ఎస్. పాఠశాల మైదానంలోకి కొన్నింటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఎక్కడైతే ఇరుకుగా ఉన్న రైతు బజార్లు ఉంటాయో అలాంటి వాటిని స్కూల్ మైదానంలోకి తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతు బజారులనూ ఉపయోగించుకోవాలని చెప్పారు. నిత్యవసర సరుకుల ధరలు ఎవరైనా పెంచినా, స్టాక్ ను బ్లాక్ లో ఎవరైనా అమ్మినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 29వ తేదీ నుండి రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులు రాష్ట్రంలో లాక్ డౌన్ ఉన్న కారణంగా వారు ఎటూ వెల్లలేని పరిస్థితి ఉంటుందని, అలాంటి వారికి సంబంధిత విద్యా సంస్థలే వారి వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉగాది పండుగను ఇళ్లలోనే పరిమితంగా చేసుకోవాలన్నారు.



రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 3 పాజిటివ్ కేసులు వచ్చాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అందుకు జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కరోనా వైరస్ వ్యాధి నివారణకు పూర్తి స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ స్వచ్చందంగా ముందుకు వచ్చి సహకరించాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన పిలుపునిచ్చారు.

నిత్యవసర సరుకులు, పాలు, తదితరమైనవి ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన లాక్ డౌడ్ కు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. అందరూ సామాజిక బాధ్యతగా దూరం పాటించాలని చెప్పారు. రైతు బజార్లుకు వెళ్లినపుడు దూరం పాటించాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు బివి సత్యవతి, విఎంఆర్‌డిఎ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ కలెక్టర్లు ఎల్ శివ శంకర్, ఎం వేణుగోపాల్ రెడ్డి, పాడేరు సబ్ కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

# కేంద్ర హెచ్చరికలు పాటించాలి

- స్వీయనియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రత అవసరం
- లాక్‌డౌన్ సమయంలో కూలీలను ఆదుకోవాలి
- వ్యాధి లక్షణాలున్నవారు స్వచ్ఛందంగా క్వారంటైన్‌కు తరలివెళ్లాలి
- అప్పుడే మహమ్మారిని కట్టడి చేసినవారిమౌతాం
- తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు



హైదరాబాద్: ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరోనాను కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐదు దశలను పాటించి బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. కరోనా వైరస్ సోకినవారు బయట తిరిగితే ఇతరులకు వ్యాప్తిస్తుందని హెచ్చరించారు. ఒకవైపు జాగ్రత్తలు తీసుకుంటూనే.. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరారు. విదేశాల నుంచి వచ్చినవారిని ముందే క్వారంటైన్ చేయాల్సిందని.. వారిని క్వారంటైన్ చేయడంలో ఆలస్యం జరిగిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పట్టణాలు, పురపాలికలు, గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని కోరారు. ఇండియాలో కరోనా వైరసన్ను కట్టడి చేయగలిగితే మన ఖ్యాతి పెరుగుతుందని అన్నారు. లాక్ డౌన్ సమయంలో పని దొరకని కూలీలను ఆదుకోవాలి. గతంలో హుద్ హుద్ తుఫాను సమయంలో నిత్యావసరాలు పంపిణీ చేసి పేదలను ఆదుకున్నాం. అలాగే ఇప్పుడు కూడా పంపిణీ చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేసింది. ఇది సరైన నిర్ణయం. ఇలాంటి తరుణంలో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించటం సమంజసం కాదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి. కేంద్రం చేసే హెచ్చరికలను అందరూ పాటించాలి. ప్రపంచ వ్యాప్తంగా 3.75 లక్షల మందికి కరోనా సోకింది. దాదాపు 17 వేల మంది చనిపోయారు. కరోనా వైరస్ వచ్చిన వారు బాధ్యతగా వ్యవహరించకపోతే ... మిగిలిన వారు ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. రాజకీయాలకు ఇది సరైన సమయం కాదు. తెలుగుదేశం పార్టీ ఒక పద్ధతి ప్రకారం ముందుకుపోతోంది. కరోనా వైరస్‌తో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే .. ఈ సమయంలో రాజకీయాలు చేస్తే ప్రజలు క్షమించరు అని చంద్రబాబు అన్నారు.

# కలిసి రండి.. కరోనాని కట్టడి చేద్దాం

ఒక నెల జీతం, 70 లక్షలు నిధులు కలెక్టర్‌కి ఇవ్వనున్నట్టు వెల్లడి

శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామమోహన్‌నాయుడు పిలుపు

శ్రీకాకుళంః కరోనాని కట్టడి చేద్దాం .. అంతా కలిసి రావాలి.. అంటూ శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచమంతా కరోనా పంజాతో విలవిల్లాడుతున్న పరిస్థితుల్లో ప్రజాప్రతినిధిగా, శ్రీకాకుళం ఎంపీగా తన నియోజకవర్గంలో సాగుతున్న వైద్య సహాయక చర్యలకు తనవంతు సాయం అందిస్తానని ప్రకటించారు. ఒక నెల జీతంతోపాటు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి 70 లక్షలు అందజేస్తున్నానని చెప్పారు. ఈ నిధులు శ్రీకాకుళం కలెక్టర్‌కి అందజేయనున్నానని, శ్రీకాకుళం పార్లమెంటు పరిధిలో ఇంకా వైద్యపరికరాలకు గానీ, ఏ అవసరం వచ్చినా తనకున్న నిధులన్నీ అందజేస్తానని తెలిపారు. రోజువారీ కూలీలు కూలికెళ్లకపోతే భోజనానికి ఇబ్బంది పడే పరిస్థితులున్నాయి. వారికి సాయంగా ఒక నెల జీతం అందజేస్తున్నానని చెప్పారు. కరోనా మహమ్మారి విజ ఇందుకు ప్రధానమంత్రి కూడా ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరుతున్నానని





కరోనా కంట్రోల్ రూంను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్, ఇతర అధికారులు

# కరోనాపై ప్రజలలో చైతన్యం కలిగించాలి

- ప్రజలకు మీడియా ద్వారా అవగాహన పెంచాలి
- సాటి మానవాళికి సహాయ పడ్డా మన్న తృప్తి
- సామాజిక మాధ్యమాలలో అవాస్తవాలను ఖండించాలి
- సమాచార శాఖ కమిషనర్ టి.వి.కె. రెడ్డి



విశాఖపట్నం: పత్రికలు, టీవీల ద్వారా కోవిడ్-19ను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రజలలో చైతన్యం కలిగించాలని సమాచార శాఖ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డి పౌరసంబంధాల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్రంలోని 13 జిల్లాల సమాచార అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కరోనాకు మందు లేదని, అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మార్గమని ప్రజలందరికీ తెలియ చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కరోనా పట్ల ఉన్న అపోహలు పోగొట్టాలి అన్నారు.

సామాజిక మాధ్యమాలలో వస్తున్న అవాస్తవాలు, అభూత కల్పనలను గమనిస్తూ వాటి పై నిఘా పెట్టి ప్రజలకు వాస్తవాలను పత్రిక టీవీల ద్వారా తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా కలెక్టరు, ప్రభుత్వం నుండి వచ్చిన ఆదేశాలు, చేపట్టిన చర్యలను గూర్చి ఎప్పటికప్పుడు సమాజానికి అందించాలన్నారు. కరోనా విస్తరించే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రచారం చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన లాక్ డౌన్ గూర్చి, ఆంక్షలు మీ అందరి సంక్షేమం కోసమే నని వివరించాలన్నరు. నిత్యావసర సరుకులు ఉదయం 9 గంటల వరకు అందుతాయని, ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా ఆచరించినట్లయితే వారం పది రోజులలో సాధారణ పరిస్థితులు వస్తాయనే విషయాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సాటి మానవాళికి సహాయ పడుతున్నామనే సంతృప్తితో విధి నిర్వహణ చేయాలన్నారు. స్థానిక టీవీ, పత్రికలకు వాస్తవాలతో కూడిన సమాచారాన్ని వీలైనంత వేగంగా తెలియజేయాలన్నారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న ఉప సంచాలకులు వి.మణిరామ్ విశాఖపట్నంలో కరోనా నివారణకు చేపడుతున్న చర్యలను మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనలు ఆదేశాలను గూర్చి కమిషనర్ కు వివరించారు. కరోనా నియంత్రణకు ఏర్పాటుచేసిన వివిధ కమిటీల నుండి సేకరించిన వైద్య పరీక్షల నిర్వహణ, విదేశాలనుండి ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారిని క్వారెంటైంన్ కేంద్రాలకు తరలింపు, కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం, క్వారింటైన్ సెంటర్స్, లాక్ డౌన్ మొదలైన సమాచారాలను పత్రికలు, టీవీ లకు పంపించి ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుండి డివిజనల్ పిఆర్ఓ డి. సాయిబాబా, ఏపీ ఆర్ వో ఎన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com